

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## సవాళ్లపై స్టడీకి ఆక్వా అడ్వైజరీ కమిటీ

4



## ఆదాయం పెరుగుదలే..
# వృద్ధికి సంకేతం

- రాష్ట్రంలో సొంత ఆదాయ వనరులు పెరగాలి
- పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టండి
- ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



2

ఆంధ్రప్రదేశ్ ఆదాయంలో 2.2 శాతం మేర వృద్ధి నమోదైనట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆదాయార్జన శాఖలపై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తూ.. రాష్ట్ర సొంత ఆదాయ వనరులు పెరిగితేనే అసలైన వృద్ధి ఉంటుందన్నారు. పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టాలని, రాష్ట్ర ఆదాయ లక్ష్యం రూ.1.37 లక్షల కోట్ల సాధనపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

## నా కుటుంబానికి భావోద్వేగభరితమైన రోజు..

ఈ రోజు నాకు, మా కుటుంబం మొత్తానికి ఎంతో భావోద్వేగభరితమైన రోజు. లక్షలాది ప్రజల హృదయాల్లో నిలిచివున్న రాజధాని అమరావతిలో మా ఇంటికి నా తండ్రి చంద్రబాబు నాయుడుగారు భూమి పూజ చేస్తున్న దృశ్యాన్ని గొప్పగాను, అమితమైన కృతజ్ఞతతో చూశాను. ఈ క్షణం ఇంటి నిర్మాణం ప్రారంభంకంటే చాలా ఎక్కువ. మన రాష్ట్ర భవిష్యత్తు కోసం నా తండ్రి ఊహించిన ప్రపంచస్థాయి రాజధాని అమరావతి నగరంలో ఇల్లు కట్టుకోవడం -నా కలయొక్క పునరుజ్జీవనం. నా తల్లి నారా భువనేశ్వరి, నా భార్య బ్రాహ్మణి, మా ప్రియమైన దేవాంశ్‌తో కలిసి ఈ పవిత్ర కార్యంలో భాగం కావడం భగవంతుడి ఆశీర్వాదం. ఇది మా ఇల్లు మాత్రమే కాదు... మా నిబద్ధతకు చిహ్నం. అమరావతిని విస్మరించలేదు. మహానగర పునర్నిర్మాణం మళ్లీ మొదలైంది.. ఎంతో బలంగా.. మరింత దృఢంగా.. ఏదీ సాటిరానంత అందంగా. రాజధాని పునరుజ్జీవనమవుతోంది.. ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తిలాగే!

**-నారా లోకేష్,**
**ఐటీ, విద్యా శాఖామంత్రి**





## సొంతింటికి శంకుస్థాపన

ఆనందంలో ముఖ్యమంత్రి కుటుంబం
నిరాడంబరంగా శుభ కార్యక్రమం

4




2

## రూ.1332 కోట్లతో తిరుపతి-పాకాల- కాట్పాడి డబ్లింగ్ పనులు

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- అభివృద్ధికి కొత్త మార్గమంటూ చంద్రబాబు హర్షం

## శాంతి భద్రతలకు ముప్పు జగన్‌రెడ్డి

**అమిత్‌షాకు ఎంపీ లావు లేఖ**

"జగన్ వ్యాఖ్యలు పోలీసుల నైతికతను దెబ్బతీసేలా ఉన్నాయి. బెయిల్‌పైవున్న జగన్.. వ్యవస్థలను బెదిరించేలా వ్యవహరిస్తున్నారు. ఆయన వ్యవహారశైలి బెయిల్ షరతులను ఉల్లంఘించడమే అవుతుంది. జగన్ ప్రసంగాలు శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లేలా ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి హానికలిగించేలా ఉన్నాయి"



వైకాపా అధినేత జగన్ శాంతి భద్రతలకు ముప్పుగా మారుతున్నారని... పర్యటనల పేరుతో విధ్వంసం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారంటూ తెదేపా ఎంపీ లావు కృష్ణదేవరాయలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు.

7

## ఆతిథ్యరంగ పెట్టుబడులకు
# ఏపీ సరైన వేదిక

- ఇన్వెస్టర్లను ఆహ్వానించిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- ఇన్వెస్టర్లకు పూర్తి భరోసా కల్పిస్తామని హామీ
- జాతీయ, అంతార్జాతీయ హోటల్స్, ట్రావెల్స్ ప్రతినిధులతో భేటీ
- దక్షిణాసియా 20వ హొటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌కు హాజరు

5

3




మంగళగిరి ఎస్ఎల్ఎన్ కాలనీలో రూ.1.06 కోట్లతో అభివృద్ధి చేసిన పార్క్‌ను మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. నియోజకవర్గంలో 30కి పైగా పార్కులు, చెరువులను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. టిడ్కో పార్క్‌ను రూ.9 కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు ప్రకటించారు.

## సైకో జగన్‌కి బుద్ధి చెపుతాం

- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- లేదంటే.. బీసీలను సమీకరించి యుద్ధం ప్రకటిస్తాం: కాలువ

6

# ఆదాయ పెంపే వృద్ధికి సంకేతం

- రాష్ట్రంలో సొంత ఆదాయ వనరులు పెరగాలి
- పన్ను ఎగవేతలకు ఏఐతో చెక్ పెట్టండి
- ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలకు తగినంత ఆదాయం పెంచుకునేంతగా పన్నుల వసూళ్లు పెరిగేలా ఆదాయార్జన శాఖలన్నీ పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మరిన్ని ఆదాయ మార్గాలను వెతకడంతోపాటు, ఎక్కడ ఆదాయం తక్కువుగా నమోదవుతుందో దానికిగల కారణాలను అన్వేషించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పన్నుల చెల్లింపుల దగ్గరనుంచి రశీదులు, నోటీసులు జారీ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగాలని ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

## పన్ను ఎగవేతలు ఉండకూడదు

మున్సిపల్ శాఖ ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా రాష్ట్రంలో వెయ్యిమందికి పైగా బిల్డర్లు అసలు రిజిస్టర్ కాలేదని ఏఐ గుర్తించింది. అయితే, తప్పని సరిగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ప్రభుత్వం ఎటువంటి ఆమోదాలైనా తెలపాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. పన్ను ఎగవేతదారులను పసిగట్టేందుకు ఏఐని వినియోగించుకోవాలని అన్నారు. అన్ని ఆదాయార్జన శాఖల్లోనూ ఇదే తరహా ప్రక్రియ అమలు చేసి పకడ్బందీగా పన్ను వసూలు చేపట్టాలన్నారు. టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా వ్యాపారులకు పన్ను చెల్లింపులు, అనుమతులువంటివి సులభతరం అవుతున్నాయనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. గత ప్రభుత్వంలా వ్యాపారులను వేధించడం కూటమి ప్రభుత్వ విధానం కాదని... వారితో సమన్వయం చేసుకుంటూ నిబంధనల ప్రకారం రావాల్సిన పన్నులన్నీ చెల్లించేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. పన్ను చెల్లింపుదారులు, జీఎస్టీ పోర్టల్, ఏపీ రాష్ట్ర డేటా సెంటర్, ఏపీసీటీడీ... ఇలా మొత్తం శాఖల సమాచారాన్ని ఏఐతో అనుసంధానించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు నోటీసుల జారీకి, గ్రీవెన్స్‌లు స్వీకరించడానికి ఏఐని వినియోగించి ప్రభుత్వ యంత్రాంగంలో మరింత వేగం పెంచవచ్చని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న రాష్ట్ర సొంత ఆదాయ లక్ష్యం రూ.1,37,412 కోట్లను 100 శాతం ఆర్జించేలా అన్ని శాఖలు కృషి చేయాలని చెప్పారు.

## రాష్ట్ర సొంత ఆదాయంలో 2.2 శాతం వృద్ధి

2023-24 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2024-25కిగాను రాష్ట్రానికి సొంతంగా ఆదాయంలో 2.2శాతం వృద్ధి నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో వృద్ధి 4.1 శాతం పెరగ్గా, పన్నేతర ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. జీఎస్టీలో 4.9శాతం వృద్ధి, ప్రొఫెషనల్ ట్యాక్స్‌లో 15.2శాతం వృద్ధి, ఎక్సైజ్ ఆదాయంలో 24.3 శాతం వృద్ధి నమోదైంది.

## నూతన ఎక్సైజ్ పాలసీ సక్సెస్

కొత్త ఎక్సైజ్ పాలసీ ప్రకటించిన దగ్గరనుంచి ఆదాయాన్ని పరిశీలిస్తే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గతంకన్నా మెరుగుపడింది. అక్టోబర్ 2024 నుంచి మార్చి 2025 వరకు రూ.4,330 కోట్ల ఆదాయం రాగా, దాదాపు 33 శాతం ఎక్సైజ్ ఆదాయం పెరిగింది. అలాగే, మున్సిపల్ శాఖలో 2023-24కంటే 2024-25లో రూ.500 కోట్లకు పైగా ఆదాయం అదనంగా వచ్చింది. పన్నులకు సంబంధించి ఇంకా సుమారు రూ.2,500 కోట్ల బకాయిలు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆస్తులకు సంబంధించిన పన్నులు, అలాగే ఖాళీ స్థలాల పన్నులు అధికంగా వసూలు కావాల్సి ఉన్నాయి. మార్చి నెలలో ప్రకటించిన 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో కేవలం 6 రోజుల్లోనే మొత్తం ఆస్తిపన్నులు రూ.240 కోట్లు వసూలయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి అధికారులు తీసుకొచ్చారు.

# రూ.1332 కోట్లతో తిరుపతి-పాకాల- కాట్పాడి డబ్లింగ్ పనులు

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి
- అభివృద్ధికి కొత్త మార్గమంటూ చంద్రబాబు హర్షం





ఢిల్లీ (చైతన్య రథం): తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్లమేర డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రూ.1,332 కోట్లతో తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి వివరించారు. "తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో పర్యాటకంగా ఎంతో అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. లక్షల సంఖ్యలో పర్యాటకులు వస్తారు. తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ ప్రాంతంలోనే ఉన్నాయి. తిరుపతి-వెల్లూరు మార్గం వైద్య, విద్యపరంగా ఎంతో కీలకం. తిరుపతి-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులతో 400 గ్రామాల్లోని 14 లక్షలమంది జనాభాకు లబ్ది చేకూరుతుంది. 35 లక్షల పనిదినాలు కల్పించేందుకు అవకాశం ఉంటుంది. ఏడాదికి 4మిలియన్ టన్నుల సరకు రవాణాకు అవకాశం ఉంటుంది" అని కేంద్ర మంత్రి వెల్లడించారు.

## అభివృద్ధికి ఇది కొత్త మార్గం: చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్లోని తిరుపతి-పాకాల-కాట్పాడి మధ్య 104 కిలోమీటర్లమేర డబ్లింగ్ పనులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షంవ్యక్తం చేశారు. డబ్లింగ్ పనులు చేపట్టేందుకు రూ.1,332 కోట్లు కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరపున చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "డబ్లింగ్ పనులకు ఆమోదం తెలిపి రూ.1,332కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు. ఈ ప్రాజెక్టు తిరుపతి, శ్రీకాళహస్తి,చంద్రగిరి కోటను అనుసంధానం చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈప్రాంతాలను అనుసంధానం చేయడం ద్వారా వైద్యం,విద్యా రంగాల్లో వెల్లూరు,తిరుపతికి మరింత ప్రాధాన్యత వచ్చేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థనూ మెరుగు పరుస్తుంది. ఏపీలోని సిమెంట్,స్టీల్,ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల పురోగతిని మరింత వేగవంతం చేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో లైన్ కనెక్టివిటీలో నూతన శకానికి నాంది పలికినట్లు అవుతుంది" అని చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని ఆదేశం**



ఢిల్లీ: ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతోపాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది.

ఈ సమీక్ష సమావేశంలో అమరావతి- హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని.. దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.

చైతన్యరథం








# ఎస్ఎల్ఎన్ పార్కును ప్రారంభించిన మంత్రి లోకేష్

## త్వరలో రూ.9కోట్లతో టిడ్కో పార్కు అభివృద్ధి

మంగళగిరి (చైతన్య రథం): మంగళగిరి ఎస్ఎల్ఎన్ కాలనీలో అభివృద్ధి చేసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి పార్కు (ఎస్ఎల్ఎన్ పార్క్)ను మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. 0.35 ఎకరాల్లో విస్తరించివున్న పార్క్‌ను రూ.1.06 కోట్లతో అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా లోకేష్ స్థానికులతో మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు 30కి పైగా పార్కులు, చెరువులను దశలవారీగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. మంగళగిరిలోని టిడ్కో పార్క్‌ను రూ.9కోట్లతో అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఇందుకు సంబంధించిన పనులను కూడా ఈనెలలోనే ప్రారంభిస్తామని ప్రకటించారు. నులకపేట, చినకాకానిలో లేక్ పార్కులనుకూడా అభివృద్ధిచేసి వాకర్స్‌కి అందుబాటులోకి తెస్తామని లోకేష్ వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గం కూటమి ముఖ్య నేతలు పాల్గొన్నారు.



















చైతన్యరథం

# సొంతింటికి శంకుస్థాపన



## హాజరైన ముఖ్యమంత్రి కుటుంబం

## నిరాడంబరంగా శుభ కార్యక్రమం

అమరావతి (చైతన్య రథం): ఏపీ సీఎం చంద్రబాబు రాజధాని అమరావతిలో తన ఇంటి నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. వెలగపూడి సచివాలయం వెనక ఈ9 రహదారి పక్కనే ఇంటి నిర్మాణం చేపట్టారు. గత ఏడాది డిసెంబరులో వెలగపూడి రెవెన్యూ పరిధిలో 5 ఎకరాల విస్తీర్ణంలోని నివాస ప్లాట్‌ను ఇదే గ్రామానికి చెందిన రైతు కుటుంబంనుంచి కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఇటీవలే ప్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. ఇంటిని 1,455 చ.గజాల విస్తీర్ణంలో జి ప్లస్ 1లో నిర్మించనున్నారు. పనులు పూర్తిచేసి ఏడాదిలోపు గృహప్రవేశం చేయాలని భావిస్తున్నారు. కార్యక్రమంలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్ పాల్గొన్నారు.





## ఫాదర్ విన్సెంట్‌కు ఐటీ మంత్రి లోకేష్ నివాళి



అమరావతి (చైతన్య రథం): అనంత ఆశాజ్యోతి, కరువునేలపై ప్రజలకు అన్ని విధాలా అండగా నిలిచిన కరుణామూర్తి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి సందర్భంగా విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ నివాళి అర్పించారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. ఆ మహనీయుని సేవలు ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన స్మృతికి నివాళి అర్పిస్తున్నా. స్పెయిన్‌లో పుట్టిన విన్సెంట్ ఫెర్రర్ సేవాభావం అనంతపురం జిల్లావాసులతోపాటు తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రాంతాల ప్రజలకు ఫాదర్‌ని చేసింది. ఒక తండ్రిలా సాయం అందిస్తూ.. విద్య, వైద్య, ఉపాధిరంగాల ద్వారా ఎనలేని సేవలు అందించిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కారణజన్ముడు. పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు ఆలోచన నుంచి పుట్టి అమలవుతున్న పీ-4 విధానానికి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌లాంటి మహనీయుల స్వచ్ఛందసేవలే ఆదర్శం' అని లోకేష్ పేర్కొన్నారు.

# పోలీస్ యూనిఫాంను జగన్ రెడ్డి పీకలేరు

## ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి సత్యకుమార్

అమరావతి (చైతన్య రథం): పోలీస్ యూనిఫాం అనేది చట్టాలపట్ల నిబద్ధతకు, చట్టంముందు అందరూ సమానులేనన్న రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అంటూ.. అలాంటి వ్యవస్థపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌కు రాజకీయాల్లో అండే అర్హత లేదని వైద్య మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ట్వీట్ చేస్తూ -పోలీసులన్నా, చట్టాన్ని అమలు చేసే వ్యవస్థలన్నా వంశపారంపర్యంగా జగన్‌కు ఏవగింపు. పలు దుర్మార్గాలకు ప్రతీకైన తన తాత రాజారెడ్డి నుంచే ఈ లక్షణం ఆయనకు అబ్బింది. ఆవిధంగా ఆయన రక్తంలో అది ప్రవహిస్తోంది. పోలీస్ యూనిఫాం అనేది చట్టాలపట్ల నిబద్ధతకు, చట్టం ముందు అందరూ సమానులేనన్న రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. కనుకనే ఫ్యూడలిస్టిక్ మానసికతకు మారుపేరైన జగన్ కుటుంబానికి చట్టంముందు అందరూ సమానులేనన్న సూత్రం గిట్టదు. ఇతరులకన్నా తాము భిన్నమని, చట్టాలకు తాము అతీతులమని భావిస్తారు. అధికారంలోవున్న ఐదేళ్లూ మనసా వాచా ఈ విపరీత మనస్తత్వాన్ని తన ప్రతి మాటలోనూ, పనిలోనూ జగన్ వ్యక్తపర్చారు. నేడు పోలీసులు చట్టాలు, నియమాలను గురించి చెప్తుంటే ప్రతిపక్షంలో ఉన్న జగన్‌కు సుతారమూ గిట్టటం లేదు. తాను మరలా అధికారంలోకొస్తే పోలీసులు ధరిస్తున్న యూనిఫాంను తొలగొస్తామంటూ జగన్ చేసిన హెచ్చరికలో నిగూడార్థం దాగిఉంది. అదేమంటే.... మరలా అధికారంలోకొస్తే పోలీసుల మౌలిక స్వరూపాన్ని సమగ్రంగా మార్చివేస్తానంటూ ఆయన స్పష్టంగా హెచ్చరించడం. చట్టాలకు, నియమాలకు లోబడి పనిచేసే పోలీసు వ్యవస్థను తన సొంత సైన్యంగా మార్చుకుంటానని చెప్పకనే చెప్తున్నారు. ఈ దిశగా అధికారంలో ఉన్నప్పుడే జగన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కానీ, ఆయన నిజ స్వరూపాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో జగన్ బట్టలూడదీసి నగ్నంగా నిలబెట్టడంతో ఆయన ప్రయత్నాలు పూర్తిగా ఫలించలేదు. పోలీసులు ఎంతో పవిత్రంగా భావించే యూనిఫాంకు జగన్‌నుంచి ఎటువంటి ముప్పు రాదని నేను వారికి హామీ ఇస్తున్నా.



రాష్ట్రంలో ప్రజా సంరక్షణ దిశగా పోలీసుల టోపీలపై ఉండే సింహాలు గర్జిస్తూనే ఉంటాయి. జగన్ మరలా అధికారంలోకి రావటం అసంభవం. ఎందుకంటే జగన్‌రెడ్డికి రెండోసారి అధికారాన్ని చేపట్టే అర్హత లేదని రాష్ట్ర ప్రజలు గత ఎన్నికల్లో స్పష్టమైన సందేశాన్నిచ్చారు' అని సత్యకుమార్ పేర్కొన్నారు.

# కోరివితో తిరిగి ఎవరైనా తలగోక్కుంటారా?

## జగన్ మళ్లీ అధికారంలోకి రావడం పగటి కల కాదా?



**- గురజాల మాల్యాద్రి,**
**చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్**

వైసీపీ పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కోల్పోయింది నిజం కాదా? ఏం చూసి జగన్‌కు అధికారం ఇస్తారు? పథకాల ద్వారా పేదలకు ఇచ్చిన దానికన్నా వారి వద్ద పిండు కొన్నదే ఎక్కువ కాదా? పదిచ్చి వంద కొట్టేయడం మోసకారి సంక్షేమం కాదా? ఈ మోసకారి తనం పేదలు తమ అనుభవం ద్వారా గుర్తించే కదా 11 సీట్లకు కుందించారు. డీబీటీ గురించి, మీగురించి.. మీరు ఎంత గొప్పగా టముకు వేసుకొన్నా పేదలు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు. అలా సూపర్ సిక్స్‌పై చేసే అబద్ధపు ప్రచారం ఎంతోకాలం నిలవదు. జూన్, జూలై నాటికి తల్లికి వందనం కింద ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబానికి రూ.30 వేలు అందుతాయి. ఈ స్కీమ్‌లో జగన్ ఇచ్చింది కేవలం రూ.13వేలు మాత్రమే. అన్నదాత సుఖీభవ ద్వారా రైతుకు రాష్ట్ర నిధుల నుంచి చంద్రబాబు ప్రభుత్వం రూ.14వేలు ఇస్తుంది. ఈ స్కీమ్‌లో జగన్ రైతుకు రాష్ట్ర నిధుల నుంచి ఇచ్చింది కేవలం రూ.7500 మాత్రమే. ఇప్పటికే కోటి మందికిపైగా మహిళలు ఉచిత గ్యాస్ పొందుతున్నారు. రాబోయే మూడు నెలల్లోపే డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ నియమకాలు పూర్తి అవుతాయి. జగన్ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా జరపని సంగతి యువత ఎలా మర్చిపోతుంది? పింఛన్ మొదటి ఏడాది జగన్ కేవలం రూ.250మాత్రమే పెంచగా.. చంద్రబాబు ప్రభుత్వం ఒకేసారి రూ.1000 పెంచింది పేదలకు తెలియదనుకొంటున్నారా? జగన్ మాయమాటలకు, కపట ప్రేమకు పేదలు తిరిగి మోసపోయేంత అమాయకులు కాదు. దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ మొదటి ఏడాదే మేనిఫెస్టో హామీలన్నీ అమలు చేసిన ప్రభుత్వం ఏదీ లేదు. జగన్ ఐదేళ్లలో 85 శాతం మేనిఫెస్టో హామీలకు ఎగనామం పెట్టారు. అభివృద్ధి, సామాజిక న్యాయానికి గండికొట్టారు. చంద్రబాబు పాలనలో ఇప్పటికే 50 శాతంపైగా హామీలు అమలు చేశారు. సూపర్ సిక్స్ నూటికి నూరుశాతం అమలు చేస్తారు. అదనంగా అభివృద్ధి, సామాజిక న్యాయం జరుగుతుంది. ఈసారి కోడి కత్తి, గులకరాయి, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ తగలబెట్టడం, సానుభూతి కోసం చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య లాంటి నేరాలకు పాల్పడే వారికి కఠిన దండన తప్పదు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని రెచ్చగొట్టే కుట్రపూరిత, అబద్ధపు ప్రచారాలకు తగిన ట్రీట్‌మెంట్ తప్పదు. జగన్ తిరిగి అధికారా నికి వచ్చే సమస్యే ఉత్పన్నం కాదు. తిరిగి అధికారానికి వస్తామని జగన్ చెప్పే మాటలు నమ్మి అగత్యాలకు పాల్పడితే తీవ్రంగా నష్టపోతారు. తిరిగి చంద్రన్న అధికారానికి వచ్చి స్వర్ణాంధ్రను సాధిస్తారు.

## సవాళ్లపై స్టడీకి ఆక్వా అడ్వైజరీ కమిటీ

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కారు

అమరావతి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ టంప్ టారిఫ్‌ల ప్రభావం నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ఆక్వా కల్చర్ అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేసింది. ఆక్వా ఎగుమతులపై అమెరికా టారిఫ్ సవాళ్లు అధిగమించే చర్యలపై కమిటీ అధ్యయనం చేయనుంది. ఆక్వా ఎగుమతిదారులు, రైతులు, ఫీడ్ కంపెనీ ప్రతినిధులు, హేచరీలు, ఎంపెడాకు చెందిన మొత్తం 16మంది సభ్యులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయంపై ఇటీవల కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాసిన విషయం తెలిసిందే. అమెరికా సుంకాలతో నష్టపోతున్న ఆక్వారంగాన్ని ఆదుకోవాలని, సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా యూఎస్ ప్రభుత్వంతో చర్చలు జరపాలని చంద్రబాబు ఆ లేఖలో కోరారు.

# ఆతిథ్యరంగ పెట్టుబడులకు ఏపీ సరైన వేదిక

- ఇన్వెస్టర్లను ఆహ్వానించిన పర్యాటక మంత్రి కందుల దుర్గేష్
- ఇన్వెస్టర్లకు పూర్తి భరోసా కల్పిస్తామని హామీ
- జాతీయ, అంతార్జాతీయ హోటల్స్, ట్రావెల్స్ ప్రతినిధులతో భేటీ
- దక్షిణాసియా 20వ హెూటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌కు హాజరు



అమరావతి (చైతన్య రథం): ఆతిథ్యరంగంలో పెట్టుబడులే లక్ష్యంగా ముంబయి పర్యటనకు వెళ్లిన మంత్రి కందుల దుర్గేష్ బృందం బుధవారం దాదాపు 20కిపైగా ప్రఖ్యాత హెూటల్స్, ట్రావెల్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ముంబయిలోని ది వెస్టిన్ ముంబయి పోవై లేక్‌లో ఏప్రిల్ 8నుంచి 10 వరకు జరుగుతున్న దక్షిణాసియా 20వ హెూటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ వర్క్ షాప్‌లో భాగంగా మారియట్, ఐహెచ్‌జీ, ఐహెచ్‌సీఎల్, అకార్, చాలెట్, ఇమాజికా వరల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్, హమా, బీఎన్‌కే గ్రూప్, వెంటివ్ హాస్పిటాలిటీ, పార్క్ హెూటల్స్, లెమన్ ట్రీ, వెస్టిన్, బ్లాక్‌స్టోన్, హిల్టన్, సుబా హెూటల్స్, ది బీచ్ ఎహెచ్‌ఎస్, అంబుజా నోటియా, ఎస్‌ఆర్‌టీ హెూటల్స్, రాయల్ ఆర్కిడ్‌వంటి జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత సంస్థలతో భేటీ అయ్యారు. అదేవిధంగా ఆతిథ్య రంగంలోని కీలక వాటాదారులు, పరిశ్రమ నాయకులు, హెూటల్ పెట్టుబడిదారులు, డెవలపర్లు, ఆపరేటర్లు మరియు దక్షిణాసియా అంతటా ఉన్న ఇతర నిపుణులను కలిశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోందని, కేంద్ర ప్రభుత్వ సహకారం తమకు మెండుగా ఉందని తెలుపుతూ పర్యాటకులకు గమ్యస్థానాలుగా ఉన్న విశాఖపట్నం, తిరుపతి,అమరావతి, రాజమండ్రివంటి ప్రధాన నగరాల్లో లగ్జరీ రిసార్ట్స్, హెూటల్స్ నెలకొల్పాలని ఆహ్వానించారు. ఈక్రమంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ సరైన వేదిక అని, పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వారికి వెల్లడించారు. ప్రభుత్వం తరపున కల్పించే మెరుగైన రాయితీలను వివరించారు. పరిశ్రమలకు ఇచ్చే అన్ని రాయితీలను పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కల్పిస్తామని స్పష్టంగా వివరించారు. భేటీ అనంతరం పలువురు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ ఆసక్తిని కనబరిచారు. మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట, ఏపీ టూరిజం అథారిటీ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ నోడల్ ఆఫీసర్ సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కృషి

- ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ద్వారా సలహాలు అడిగాం
- వక్ఫ్ ఆస్తులు అమ్ముతున్నామనేది అబద్ధ ప్రచారం
- వక్ఫ్ బోర్డు మూడేళ్ల కాలపరిమితితో మాత్రమే లీజుకిస్తుంది
- 200మంది విద్యార్థులను ఐఐటీ, ఐఐఎమ్ కోర్సుల్లో చదివిస్తాం
- రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ వెల్లడి



అమరావతి (చైతన్య రథం): వక్ఫ్ బోర్డు ఆస్తులు అమ్ముతున్నామనే ప్రచారం అబద్ధమని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. వన్ టౌన్‌లోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఆలోచించి నిర్ణయాలు చేస్తామన్నారు. 69 వేల ఎకరాల పైచిలుకు వక్ఫ్ బోర్డు భూములుండగా.. అందులో 36వేల ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. మిగిలిన భూములనుంచి వచ్చే రెవెన్యూ ద్వారానే వక్ఫ్ బోర్డు ఉద్యోగులకు జీతాలు, పేద ముస్లింలకు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సి ఉంటుందన్నారు. ఏ పని చేయాలన్నా నిధులు అవసరం ఎంతైనా ఉంటుందన్నారు.

ఏపీ వక్ఫ్ బోర్డు స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. వక్ఫ్ బోర్డు ఆదాయం పెంచేందుకు ఖాళీగా ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాల్లో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేందుకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్' ఇవ్వమని వివిధ సంస్థలను కోరామన్నారు. అందుకు చాలా సంస్థలు ముందుకురాగా.. ముఖ్యంగా యూకే, దుబాయ్ దేశాల నుండి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారన్నారు. అలా ఐడియాలు ఇచ్చిన సంస్థలు, వాటి పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపితే వారి సూచనలనుబట్టి తర్వాత టెండర్లకు వెళ్లటమా? లేదా? అనేది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు వక్ఫ్ బోర్డు ముందుకు వెళ్తుందన్నారు. ఉమ్మడి ఏపీలో వక్ఫ్ బోర్డు కోస్తా అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. గతంలో ముస్లింలకు వివిధ పథకాలు కావాలంటే వక్ఫ్ బోర్డునుంచి వస్తాయి అనుకునే వాళ్ళమన్నారు. వక్ఫ్ బోర్డు ఆదాయం ఎలా పెంచాలా? అని అధికారులతో సమాలోచనలు చేస్తున్నట్టు చెప్పారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి ఉండేవన్నారు. ఈ రోజుకి వక్ఫ్ బోర్డు ఆస్తులు, రికార్డులు తెలంగాణలోనే ఉన్నాయని, 70 శాతం నిధులు అక్కడే ఆగిపోయాయన్నారు. నేను చైర్మన్ అయిన తరువాత తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కలవటం జరిగిందన్నారు. రంజాన్ అయిన తర్వాత మీరు అధికారికంగా డెలిగేషన్‌తో రావాలని వారు చెప్పారన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కావటానికి ముఖ్య కారణం ఈ ఆస్తులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోవటమేనన్నారు. ముఖ్యమంత్రి మాకు ఒకటే చెప్పారని.. హిందూ దేవాలయాల ఆస్తులు ఏవిధంగా కాపాడుతారో అదేవిధంగా వక్ఫ్ బోర్డు ఆస్తులనూ కాపాడాలని ఆదేశించారన్నారు.

ముస్లిం బిడ్డలు కార్పొరేట్ విద్యలు చదువుకోలేని పరిస్థితిలో ఉన్నారని, వారికి టాలెంట్ టెస్ట్ నిర్వహించి కార్పొరేట్ విద్యను అందిస్తామన్నారు. 200మంది పేద ముస్లిం వర్గానికి చెందిన 10వ తరగతి పాస్ అయిన పిల్లలకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి ఇంటర్‌లో కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు ఇప్పిస్తామన్నారు. ఆపైన ఐఐటీ, ఐఐఎమ్ చదివించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అదేవిధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లోనూ విద్యార్థులకు శిక్షణ అందిస్తామన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి రెంట్స్ తక్కువగా వస్తుందని, నికరంగా అన్ని టాక్స్‌లుపోను రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు 6శాతం మాత్రమే వస్తుందన్నారు. వక్ఫ్ బోర్డ్‌కు సంబంధించి వచ్చే అద్దెలపై రెంట్ రివ్యూ కమిటీ వేయాలన్నారు. చిన్న చిన్న షాపులకు రూ.200, 300ల అద్దె ఇచ్చే పరిస్థితి నేడు ఉందన్నారు. వేరు వేరు సంస్థల పేర్లు మీద వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు. మసీదులకు మా తాతలు ధర్మకర్తలుగా ముతావల్లీలుగా వున్నారని వాళ్లు 11 నెలలు వరకు వక్ఫ్ బోర్డు ఆస్తులు లీజుకు ఇవ్వొచ్చని, వక్ఫ్ బోర్డు 3 ఏళ్లకు లీజు ఇచ్చే అవకాశం ఉందని, మూడు ఏళ్ళు పూర్తయితే రాష్ట్ర ప్రభుత్వం లీజుకు ఇస్తుందన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులు దేవుడి ఆస్తులని ఎవ్వరికీ అమ్మటం కుదరదని, కేవలం లీజుకి మాత్రమే ఇస్తామన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తి అంటే దేవుడి ఆస్తి అని దానికి బోర్డు చైర్మన్, సభ్యులు ధర్మకర్తలుగా మాత్రమే ఉంటామని, అంతేకాకుండా ఆ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే బాధ్యత మాపై ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమల వెంకటేశ్వర స్వామిని భక్తితో చూసినట్టు వక్ఫ్ బోర్డు ఆస్తులను కూడా అలాగే చూస్తారని, ముఖ్యమంత్రి నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ముకానివ్వనన్నారు. పీఎంజేవీకే కింద స్కూల్స్, కమ్యూనిటీ హాల్స్, సోలార్ ప్రాజెక్ట్స్ నిర్మించేందుకు 60శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందన్నారు.

దేవుడి ఆస్తి కాపాడి పేద ప్రజలకు మేలు చేయాలనే ఆశతో ఉన్నామన్నారు. ఏప్రిల్ 1నుండి వక్ఫ్ బోర్డు లావాదేవీలన్నీ ఆన్ లైన్‌లోనే నిర్వహిస్తున్నామన్నారు. వక్ఫ్ బోర్డునుంచి వచ్చే ఆదాయం నుంచే సిబ్బంది జీత భత్యాలు చెల్లించాల్సి ఉందన్నారు. కమర్షియల్ భూములను ఖాళీగా ఉంచకుండా లీజ్‌కు ఇవ్వడంవల్ల వక్ఫ్ బోర్డుకు ఆదాయం వస్తుందన్నారు. లీజు ఆస్తులపై వచ్చే రెవెన్యూ మాత్రం ముస్లిం మతానికి చెందిన పేదలు, వితంతువులు, అనాథలకు మాత్రమే అందిస్తామన్నారు. మంచి చేయాలనే సంకల్పంతో ఉన్న వక్ఫ్ బోర్డుకు అందరూ సహకరించాలని కోరుతున్నానని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలియజేశారు.

# సైకో జగన్‌కి బుద్ధి చెపుతాం

- ఆయన మతిస్థిమితం లేక ఇబ్బందిపడుతున్నారు
- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- లేదంటే.. బీసీలను సమీకరించి యుద్ధం ప్రకటిస్తాం
- మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం (చైతన్య రథం): అనుకోకుండా జరిగిన హత్యను వైకాపా అధినేత జగన్ సొంత రాజకీయ ప్రాబల్యానికి వాడుకోవాలని చూడటం అత్యంత నీచమైన చర్యగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అభివర్ణించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన పోలీసు అధికారిపై చేసిన వ్యాఖ్యలను వారంలోపు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపురంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో రామగిరి పర్యటనలో జగన్ వైఖరిని ఆయన తూర్పార బట్టారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన లింగమయ్య హత్య అనుకోని సంఘటన మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సంఘటనపట్ల స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు టీడీపీ నాయకులు అప్పుడే తీవ్రంగా ఖండించడం జరిగిందన్నారు. దుర్ఘటనకు పాల్పడ్డ నిందితులను కేవలం 48గంటల్లోపే పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. చట్టప్రకారం తమపని తాము చేసుకుపోయే సంపూర్ణ స్వేచ్ఛను పోలీసులకు కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. అయితే.... లింగమయ్య కుటుంబ పరామర్శ పేరుతో మంగళవారం రామగిరికి వచ్చిన జగన్ రాజకీయ లబ్ధికోసం నానాయాగీ చేశారన్నారు. 2019-24 మధ్య ఐదేళ్ల పాలనలో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఇంటినుండి బయటకు వస్తే కేసులు పెట్టి భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. ఆఖరుకు పార్టీ సోషల్ మీడియాను కూడా వదలకుండా అక్రమ కేసులుపెట్టి వేధించారన్నారు. ఐదేళ్లు ఆటవిక రాజ్యం నడిపారని, అనంతలోను అనేక దౌర్జన్యాలు, దుర్మార్గాలు జరిగాయన్నారు. అకృత్యాలు, అరాచక పాలనతో రాక్షస ఆనందం పొందిన జగన్ తన సైకో వైఖరినే నేటికీ కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. లింగమయ్య కుటుంబానికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చకపోగా... వ్యక్తిగత స్వార్థ రాజకీయాలకు ఈ సంఘటన వాడుకోవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. రామగిరి పర్యటనలో హెలిపాడ్ వద్దకు చొచ్చుకొచ్చిన సొంత పార్టీ కార్యకర్తలను నిలువరించలేక పోయారన్నారు. పైగా తెలుగుదేశం పార్టీపై, పోలీసులపై నిందలు మోపటానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసుల బట్టలు ఊడదీస్తానని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. జగన్ మైండ్ ఎప్పుడో దొబ్బిందని ఎద్దేవా చేశారు. తన పార్టీని కాపాడుకునే పరిస్థితుల్లో ఆయన లేడన్నారు. ఆ పార్టీలో కొనసాగే వారు ఇక చులకనైపోతారన్నారు. అందులోనూ బీసీ సామాజికవర్గం పట్ల ఆయనకు చిన్నచూపన్నారు. అగ్రవర్ణ దురహంకారిగా పేరుపొందిన ఆయన రామగిరిలో పనిచేస్తున్న బీసీ సామాజికవర్గానికి చెందిన పోలీసు అధికారిపై నోరు పారేసుకోవడం, నిందలు వేయటంపట్ల ఆగ్రహం వ్యక్తపరిచారు. అదే ఏ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారైతే అలా మాట్లాడగలరా..? అని ప్రశ్నించారు. రామగిరి పర్యటన సందర్భంగా పోలీసులు 11వందల మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారని, అందులో ఎలాంటి భద్రత లోపం లేదన్నారు. హెలిప్యాడ్ వద్ద 250 మంది పోలీసులు ఉంటే జగన్‌ను హెలికాప్టర్ దిగనివ్వకుండా కార్యకర్తలు సైకోలుగా వ్యవహరిస్తూ డ్యూటీ లోవున్న పోలీసులపై రాళ్ళ దాడికి పాల్పడ్డారన్నారు. బీసీ పోలీసు అధికారిపై జగన్ తక్షణమే తన మాటలు వెనక్కి తీసుకోవాలన్నారు. వారంలోగా క్షమాపణ చెప్పకపోతే బీసీలను ఏకం చేసి జగన్ మీద యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. జగన్ పర్యటనలో ఆటంకాలు సృష్టించిన ఆ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి వాటికి చెక్ పడిందన్నారు. టీడీపీ నేర రాజకీయాలను ప్రోత్సహించదన్నారు. ఏపార్టీ వారు తప్పుచేసిన చట్టం ప్రకారం పోలీసులు వ్యవహరిస్తారన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతమవుతోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు మేలు జరిగే పనులు ప్రారంభమయ్యాయని కాలవ వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, ప్రసాద్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక డిప్యూటీ ఎంపీడీవోలుగా విస్తరణాధికారులు

- క్యాడర్‌ను మార్పు చేస్తూ జీవో 35 విడుదల
- పవన్ చొరవతో పంచాయతీరాజ్‌లో సంస్కరణలు
- పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకుల హర్షం

శ్రీకాకుళం(చైతన్యరథం): ఎన్నో ఏళ్లుగా పంచాయతీరాజ్ వ్యవస్థలో పనిచేస్తున్న పదోన్నతులకు నోచుకోని ఉద్యోగులకు ఎట్టకేలకు ఈ రోజు జీవో 35 బుధవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవోలో ఇంతవరకు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ విస్తరణ అధికారుల క్యాడర్‌ను డిప్యూటీ ఎంపీడీవోగా మార్పు చేస్తూ జీవో విడుదల చేశారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా పదోన్నతులకు నోచు కోని వేలాది మంది ఉద్యోగులకు ఉపశమనం లభించింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నేతలు, ఉద్యోగులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఇంతవరకు ఎంపీడీవో పోస్టుల భర్తీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా చేపట్టేవారని.. నూతన జీవో ప్రకారం ఆ విధానాన్ని రద్దు చేశారని స్పష్టం చేశారు. ఇక నుంచి ఎంపీడీవోలు పదోన్నతుల ద్వారా మాత్రమే వస్తారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్న నూతన జీవోను ప్రభుత్వం బుధవారం విడుదల చేయ డంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి చారిత్రక నిర్ణయానికి కారకులైన ముఖ్య మంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశి భూషణ్‌కుమార్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ, పవన్‌కళ్యాణ్ ఓఎస్‌డీ వెంకట కృష్ణలకు పంచాయతీ సంఘ నేతలు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# కాలంతో చంద్రబాబు పోటీ!

అత్యుత్తమ లక్ష్యాలు, పట్టుదల, అంకితభావం, సమర్థత, సంకల్పం.. వీటిని నాయకుడు సానుకూల శక్తిగా ఉపయోగించినప్పుడు విజయపథంలో నడిపించే ఇంధనాలే అవుతాయి. జగన్‌రెడ్డి విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఛాంపియన్‌గా నిలపాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. సీఎం చంద్రబాబు కాలంతో పోటీ పడుతున్నారు. అసమర్థ పాలకుడి అసంబద్ధ చర్యలతో గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ శిధిలమైంది. ఆంధ్రప్రదేశ్ అస్తిత్వమే ప్రశ్నార్థకమైన వేళ రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతంగా అభివృద్ధి చేయడంపైనే పూర్తి దృష్టి కేంద్రీకరించారు చంద్రబాబు. ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి బాట పట్టించడానికి పదినెలలుగా అలుపెరుగకుండా శ్రమిస్తున్నారు. పది నెలల్లోనే.. 2024-25లో జీఎస్‌డీపీ వృద్ధిరేటులోనూ, తలసరి ఆదాయం పెరుగుదలలోనూ రాష్ట్రం గణనీయమైన వృద్ధిసాధించి 8.21 శాతం వృద్ధిరేటుతో దేశంలో రాష్ట్రం రెండోస్థానంలో, తలసరి ఆదాయ వృద్ధిలో మూడో స్థానంలో నిలిచినట్టు కేంద్ర గణాంకాలు-కార్యక్రమాల అమలుశాఖ ఎంఓఎస్‌పీఐ వెల్లడించడమంటే.. వేగంగా రాష్ట్రం రెండంకెల దిశగా దూసుకెళుతుంది అనడానికి నిదర్శనంగా చెప్పుకోవాలి. గత ఐదేళ్ల పాలనలో దగాపడిన మధ్యతరగతి, అట్టడుగు ప్రజలు వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా అన్ని వర్గాల జీవనాన్ని గుణాత్మకంగా మార్చే బృహత్తర లక్ష్య సాధన కోసం విలక్షణమైన ప్రజాసంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి చంద్రబాబు 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఆధునికతను అందిపుచ్చుకొని అద్భుత వ్యూహంతో రెండంకెల వృద్ధిరేటు సాధించి నవ్యాంధ్రను ప్రగతిపథం బాటపట్టించాలని కంకణం కట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరం పదినెలల్లోనే రాష్ట్రం 8.21 శాతం వృద్ధి సాధించడం గర్వించదగ్గ విషయం. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంలో ఏపీలో అమలుచేస్తున్న పాలసీలు, విధానాలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నాయి.

కేంద్రం నివేదిక ప్రకారమే వైసీపీ హయాంలో 2023-24లో వృద్ధిరేటు కేవలం 6.19శాతం మాత్రమే కాగా.. 2024-25లో 8.21శాతం సాధించి దేశంలోనే రెండోస్థానంలో నిలవడం అభినందనీయం. ఒక్క పది నెలల్లోనే 2.02 శాతం పెరిగింది. వ్యవసాయం,పరిశ్రమలు,సేవలు, ఇంధనరంగం సహా పలురంగాల్లో తీసుకొచ్చిన విధానాలతో మెరుగైన ఫలితాలతో రాష్ట్రం గాడిలోపడింది. 2024-25లో రాష్ట్రం 8.21 శాతం వృద్ధిరేటుతో రూ.8.65 లక్షల కోట్ల జీఎస్‌డీపీని సాధించిందని కేంద్రం తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ధరల ప్రకారం 12.02 శాతం వృద్ధిరేటుతో రూ.15.93లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదైంది. ఈ విభాగంలో 5వ స్థానంలో నిలిచింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15.41శాతం వృద్ధిరేటు నమో దైంది. వ్యవసాయ రంగంలో 22.98 శాతం, ఉద్యానరంగంలో 21.29శాతం నమోదైంది. పారిశ్రామిక రంగం ఇంకా స్తబ్దుగానే ఉంది. 6.4శాతం వృద్ధి మాత్రమేనమోదైంది. నిర్మాణ రంగంలో 10.28 శాతం, ఉత్పాదకం 5.18 శాతం, సేవలు 11.82 శాతం, విద్య, ఆరోగ్యం 12.15 శాతం, వాణిజ్యం,హోటళ్లు, ఇతర రంగాల్లో 11.58 శాతం వృద్ధి నమోదైంది. రియల్ ఎస్టేట్స్, ఇతర రంగాలు 11.22శాతం నమోదు చేశాయి. 2024-25లో తలసరి ఆదాయంలో 11.89శాతం వృద్ధి నమోదైంది. తలసరి రాబడి రూ.2,66,240కు చేరింది. ఇందులో రాష్ట్రం 3వ స్థానంలో నిలవగా, తమిళనాడు, కర్ణాటక మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను దేశం ముందు నిలిపారు సీఎం చంద్రబాబు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా వృద్ధిరేటులో దేశంలో రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్‌ని నిలిపారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అలంబనలయ్యే పోలవరం, అమరావతి రాజధాని నగర నిర్మాణాలను పరుగులు తీయిస్తున్నారు. 15 శాతానికి పైగా వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా నూతన పారిశ్రామిక పాలసీలు రూపొందించారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తోన్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తెచ్చిన పాలసీల ఫలితంగా పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా నిలుస్తోంది. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తెచ్చి రాష్ట్ర ఆదాయం పెంచాలని, యువతకి ఉపాధి కల్పించాలని ఆయన తపన పడుతున్నారు. 2047నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యంగా చంద్రబాబు ప్రణాళిక సిద్ధం చేశారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలు తరలివచ్చేలా, విదేశీ కంపెనీలు సైతం పెట్టుబడులు పెట్టడానికి పాలసీలు ఆదర్శంగా నిలిచాయి. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో ఇప్పటికే రూ.8.5 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది ప్రభుత్వం. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నంలో బీపీసీఎల్ తదితర భారీ పరిశ్రమలు రావడమే ఇందుకు నిదర్శనం. ఇంకా పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఒక పారిశ్రామిక పార్కును ప్రారంభించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నది ప్రభుత్వం.

ప్రజల వలన, ప్రజల కొరకు, ప్రజల చేత ఏర్పడిన ఈ ప్రజాస్వామ్యంలో పీపుల్స్ ఫస్ట్.. ప్రజలే ముందు అన్న నినాదాన్ని ప్రభుత్వం తొలిసారి అమలులోకి తెచ్చి, ప్రజలే ముందు అన్న స్ఫూర్తిని అన్ని కార్యాలయాల్లోనూ అమలుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బలంగా చెప్పడం ప్రజలు గర్వించదగ్గ విషయం. ప్రజలే ముందు, ప్రజలే ముఖ్యం అని అధికారులను ఆదేశించిన నాయకుడు. పాలనలో మానవీయత మరవొద్దని చెప్పిన ఆదర్శనేత. సమస్యల సుడిగుండంలోకి నెట్టబడిన రాష్ట్రాన్ని బాగు చెయ్యడం కోసం తాను ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం కోసం శ్రమిస్తున్నారు. అభివృద్ధి ఎంత ముఖ్యమో ప్రజా సంక్షేమం కూడా అంతే ముఖ్యమని గ్రహించి.. జన సంక్షేమాన్ని కాంక్షించకుండా జరిగేది అసలు అభివృద్ధే కాదని, ప్రగతికి నిజమైన జన సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. నేడు మనసున్న ప్రభుత్వాన్ని ప్రజలు తొలిసారి చూస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు గుండెలుంటాయి కానీ హృదయం అరుదుగా ఉంటుంది. నేడు అటువంటి హృదయమున్న ప్రభుత్వం వున్నది రాష్ట్రంలో. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్. ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని, పి-4 విధానం ద్వారా రాష్ట్రంలోని పేదరికాన్ని జీరో పావర్టీగా సమూలంగా నిర్మూలించాలని సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారు. 2047 విజన్ సాకారం కోసం సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్న పది సూత్రాల్లో సున్నాస్థాయికి పేదరిక నిర్మూలన ఒకటి. సమాజంలో పైస్థాయిలో సంపన్నులుగా ఉన్న పదిశాతం మంది చేయూత ద్వారా అట్టడుగున కటిక దరిద్రంలో మగ్గుతున్న ఇరవై శాతం మందిని ఆర్థికంగా పైకి తీసుకురావడమే లక్ష్యంగా పారిశ్రామిక, విద్య, వ్యాపార, వాణిజ్య రంగాల్లో డబ్బులు సంపాదించిన సంపన్నులు పేదలను అక్కున చేర్చుకునే మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆయన చేసిన విజ్ఞప్తులకు స్పందించి పేదలను ఆదుకోవడానికి సంపన్నులు ముందుకు వస్తున్నారు. పేదలను గుర్తించాలని అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. పి-4 విధానం ద్వారా పేదరికాన్ని నిర్మూలించి విజనరీ నాయకుడుగా నిలవనున్నారు సీఎం చంద్రబాబు. ఎవరేమన్నా చక్కటి అభివృద్ధి ప్రణాళికతో 15శాతానికి పైగా వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌ని అభివృద్ధి బాట పట్టించడానికి సీఎం చంద్రబాబు కాలంతో పోటీ పడుతున్నారు.

- నీరుకొండ ప్రసాద్

# నోరు అదుపులో పెట్టుకోకుంటే తోలు తీస్తాం

- టీడీఆర్ స్కామ్‌లో రూ.390 కోట్లు మింగావ్
- భూ కబ్జాలలో కాలనాగువి..నీ చరిత్ర తెలుసు
- కారుమూరికి మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరిక



అమరావతి (చైతన్యరథం): వైసీపీ గుండాల రాజకీయాలు కూటమి ప్రభుత్వంలో చెల్ల వని, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తోలు తీస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. జగన్ పెట్టిన వైసీపీ పార్టీ, రాజకీయ గుండాలకు, రౌడీలకు, అవినీతిపరులకు పుట్టినిల్లు లాంటిదని, అటువంటి పార్టీకి ప్రజలు చెంప చెల్లుమనిపించినా కూడా కారుమూరి ఇంకా మొరుగు తునే ఉన్నాడని ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్ల నేర సంస్కృతిలో కారుమూరి కూడా సూత్ర ధారేనని, ముఖ్యంగా బీసీలను హతమార్చిన ద్రోహి అని గుర్తు చేశారు. వైసీపీ హయాం లో బీసీ కార్పొరేషన్‌లకు చిల్లి గవ్వ కూడా ఇవ్వని జగన్‌ను ఏ రోజైన ప్రశ్నించావా? అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీఆర్ బాండ్ల స్కామ్‌లో ఏకంగా రూ. 390 కోట్లు మింగేశావు.. వేలాది ఎకరాల భూములు కబ్జా, బ్యాంకుల స్కాములు, దందాలు ఒకటే మిటి ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ ప్రభుత్వంలో ఓ అవినీతి కాలనాగు చరిత అంద రికీ తెలిసిందేనని గుర్తు చేశారు. ఇటువంటి ఓ రాజకీయ గుండా టీడీపీ వాళ్లను బెదిరిస్తే బెదరరని, కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మొదలుపెడితే రాష్ట్రంలో వైసీపీ ఆనవాళ్లు కూడా కనపడవని స్పష్టం చేశారు. కూటమి నాయకుల జోలికి వచ్చినా.. కనీసం వారిని టచ్ చేయాలని చూసినా పరిణామాలు ఏ విధంగా ఉంటాయో వైసీపీ రౌడీలకు రుచి చూపిస్తామని హెచ్చరించారు. వైసీపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని భారీ గా అవినీతికి పాల్పడిన కారుమూరి లాంటి అవినీతి నాగుల కోరలు పీకేసి కటకటాల్లోకి పంపిస్తామని హెచ్చరించారు. అధికారంలో ఉండగా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన మీకు రాజ్యాంగం, చట్టం గుర్తుకు రాలేదా? మా నాయకుడు చంద్రబాబు రాజ్యాంగాన్ని అనుసరించి పాలించడం వల్ల బతికిపోయారు..చేసిన అక్రమాలకు, దౌర్జన్యాలకు, అవినీ తికి ఎప్పటికైనా చట్టానికి సమాధానం చెప్పి తీరాల్సిందేనని, చేసిన తప్పులకు ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదని స్పష్టంచేశారు.

# తిరుపతి-పాకాల-కాట్పాడి రైల్వే డబ్లింగ్ పనులు

- రూ.1,332 కోట్లతో ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం
- ప్రధాని, రైల్వే మంత్రికి రామ్మోహన్ కృతజ్ఞతలు
- ఏపీ అభివృద్ధికి ప్రాజెక్టు ఊతం: అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం (చైతన్యరథం): టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ రైలు-రోడ్డు కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. తిరుపతి-పాకాల-కాట్పాడి రైల్వేలైన్‌ను డబుల్ ట్రాక్‌గా అభివృద్ధి చేసేందుకు రూ.1,332 కోట్లతో ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర పౌర విమాన యాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పందిస్తూ ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు నవ్యాంధ్ర అభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ లైన్ డబ్లింగ్‌తో ఉత్తరాంధ్ర నుంచి తిరు పతికి వచ్చే భక్తులకు ప్రయాణం మరింత సౌకర్యవంతం, వేగవంతం కానుందన్నారు. అంతేకాకుండా విద్య, వైద్య అవసరాల కోసం వెల్లూరు కు వెళ్లే ప్రయాణికులకు ఇది గొప్ప వనరుకానుందని వివరించారు. ఏడాదికి 4 మిలియన్ టన్నుల సరుకు రవాణా సాధ్యం కావడం ద్వారా పరిశ్రమల వృద్ధికీ ఇది తోడ్పడనుందని, ముఖ్యంగా రాష్ట్రంలోని ఎలక్ట్రానిక్, సిమెంట్, స్టీల్ రంగాలకు మరింత ప్రయోజనం చేకూర్చ నుందని తెలిపారు. ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే పలు ప్రాంతీయ అభివృద్ధి పనులు వేగం పుంజు కుంటా యని, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రా యపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టను న్న ఈ ప్రాజెక్టు డబుల్ ఇంజన్ పాలన విజయాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.



**ఏపీ అభివృద్ధికి ఊతం: అచ్చెన్నాయుడు**

తిరుపతి-కాట్పాడి రైల్వేలైన్ డబ్లింగ్ ప్రాజెక్టు ఆమోదంపై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీకి, రైల్వేమంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట అనుసంధానంతో పాటు వెల్లూరు, తిరుపతి వంటి విద్య, వైద్య కేంద్రాలకు ప్రాజెక్టు ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. ఈ ప్రాజెక్టు వ్యవసాయ, ఆర్థిక వ్యవస్థను బలపరచ డంతో పాటు ఏపీలో ఎలక్ట్రానిక్స్, సిమెంట్, ఉక్కు పరిశ్రమల వృద్ధిని వేగవంతం చేస్తుం దని ఆకాంక్షించారు.

# శాంతిభద్రతలకు ముప్పుగా జగన్‌రెడ్డి

**బెయిల్ నిబంధనలు ఉల్లంఘించారు - ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు - కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో శాంతిభద్రతలకు ముప్పుగా మారుతున్న జగన్ రెడ్డి అరాచకాలపై టీడీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పర్యటనల పేరుతో జగన్ విధ్వంసం సృష్టించాలని చూస్తున్నాడు. పాపిరెడ్డిపల్లిలో జగన్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అప్రజా స్వామికం. రాజ్యాంగబద్ధంగా పనిచేస్తున్న ప్రభుత్వంపై విషం కక్కుతూ పోలీసుల నైతిక తను దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్‌పై తిరుగుతున్న జగన్, వ్యవస్థలను బెదిరించేలా వ్యవహరిస్తున్నాడు. నిజాయితీగా పనిచేస్తు న్న పోలీసులపై జగన్ చేసిన వ్యాఖ్యలు బెయిల్ షరతులు ఉల్లంఘించటమేనని పేర్కొ న్నారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్యను గుండెపోటుగా చిత్రీకరించి, ఆ మర ణాన్ని రాజకీయ ప్రయోజనానికి వాడుకున్న నీచుడు. 'కోడి కత్తి' నుంచి 'రాళ్ల దాడి' వరకూ ప్రతిదీ నాటకమే. కోడి కత్తి కేసులో ఎన్ఐఏ ముందు ఒక్కసారి కూడా హాజరు కాని వ్యక్తి ఇప్పుడు పోలీసులపై ఆరోపణలు హాస్యాస్పదమన్నారు. జడ్ ప్లస్ భద్రత, 2,500 పోలీసులతో బందోబస్తు ఇచ్చినా కూడా నిసిగ్గుగా జగన్ ప్రభుత్వాన్ని తప్పు పడు తున్నాడని లేఖలో వివరించారు. కులాల మధ్య, వర్గాల మధ్య చిచ్చు రేపేలా జగన్ ప్రసంగాలు చేయడం, కార్యకర్తలను రెచ్చగొట్టడం, ఇవన్నీ శాంతి భద్రతలకు ముప్పు కలి గించే కుట్రలుగా పేర్కొన్నారు. ముందుగానే రోడ్డు ప్రయాణం ప్లాన్ చేసి స్క్రిప్ట్ ప్రకారం డ్రామాకు తెరలేపి అలజడులు సృష్టించడానికి నక్కజిత్తుల కుట్రలు జగన్ మూరా ప్రయ త్నిస్తోందన్నారు. ప్రజలు ఆదరించిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తోందని, బాధ్యతారాహితంగా వ్యవహరిస్తున్న జగ న్‌రెడ్డి తీరు రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి హానికరంగా మారిందని వివరించారు.



# కేంద్ర పథకాలు లబ్ధిపొందేలా చూడాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పెండింగ్ పనులను వేగవంతం చేయాలి
- 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్
- పథకాల అమలుపై కృష్ణా జిల్లా కలెక్టర్‌తో సమీక్ష




మచిలీపట్నం (చైతన్యరథం): జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటి అభివృద్ధి ఫలాలను అర్హులైన పేద ప్రజలకు అందించే దుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమ లు చైర్మన్ లంకా దినకర్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథ కాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సంక్షించారు. మచిలీపట్టణం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మట్టా ప్రసాద్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సమీక్షలో ప్రధానంగా ఉపాధి హామీ పథకం ప్రస్తుత అమలు తీరు, మెటీరియల్ కాంపొనెంట్ వినియోగం, జిల్లాలోని ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు, కుళాయి ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్‌జీవన్ మిషన్ అమలు తీరు, 2019 - 24 మధ్య జిల్లాలో స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 2015-16లో అమృత్ పథకం కింద ఇచ్చిన నిధుల వినియోగం, అమృత్ 2.0 లక్ష్యాలు, గ్రామీణ సడక్ యోజన, లక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్, పీఎం ఆవాస యోజన, టిడ్కో గృహాలు, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం సమ్మాన్ నిధి వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు బందరు పోర్ట్ నిర్మాణం పురోగతి, పోర్ట్ ఆధారిత ప్రాజె క్టుల అవసరంపై సమీక్ష జరిగింది. అనంతరం ఆయన జెడ్పీ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సంకల్పం వికసిత్ భారత్ 2047, ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయం స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు వికసిత్ కృష్ణా జిల్లాతో అది సాధ్యమన్నారు. ప్రభుత్వ పథకాల అమలు రథసారథులుగా వ్యవహరిస్తూ జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సంవత్సరం ఉపాధి హామీలో మెటీరియల్ కాంపొనెంట్ వినియోగించుకోదగిన నిధు లు ఇప్పటివరకు ఏ జిల్లాలో కూడా మెటీరియల్ కాంపొనెంట్ పూర్తిగా అవకాశం ఉన్నం త వరకు వాడుకోలేదని, అయితే కృష్ణా జిల్లాలో మాత్రం అవకాశం ఉన్నదానికన్నా అధి కంగా వినియోగించడం జరిగిందన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో పాటు సంబం ధిత అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఉపాధి హామీ పనిదినాల వినియోగం పెంచాలని అధికారులకు సూచించామన్నారు. ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన, పీఎం స్వానిధి వంటి పథకాల ద్వారా రుణాలు సకాలంలో మంజూరు చేసే విధంగా చేయూతనివ్వాలని సూచించామన్నారు. గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాలలో రహ దారుల నిర్మాణ పనులు వేగంగా జరగాల్సిన అవసరం ఉందని అధికారుల దృష్టికి తేవ డం జరిగిందన్నారు. 2020-21 నుంచి ఇంకా దీర్ఘకాలంగా మిగిలిపోయిన మూడు పాత పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. జిల్లాలో స్వయం సేవ గ్రూపు లలోని 2,99,349 మంది మహిళలలో 1,29,870 లక్‌పతి దీదీలుగా ఉన్నారని, మిగి లిన 1,69,479 మందిలో సాధ్యమైనంత ఎక్కువ మందిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో 11 మంది డ్రోన్ దీదీలను ఎంపిక చేయగా 6 గురికి శిక్షణ ఇచ్చి, ఇద్దరికీ డ్రోన్లను ఇవ్వడం జరిగిందన్నారు. అమృత్ 1.0లో పూర్తికాని పనులకు అమృత్ 2.0 అనుసంధానానికి ప్రతిపాదనలు లేవని, ఈ అంశాన్ని పరిగ ణనలోకి తీసుకొని అమృత్ 2.0 కింద ప్రతిపాదనలు పంపాలని సూచించామన్నారు. అదేవిధంగా గుడివాడ, ఉయ్యూరు మున్సిపాలిటీలకు అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ఏ విధంగా వినియోగించుకోవాలన్నది ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో వేగం పెంచాలని, ఈ పథకం కింద మొత్తం 78,986 రిజిస్ట్రేషన్లు పూర్తయినా ఇన్‌స్టాలేషన్ చాలా మందగమనంగా ఉందన్నారు.

చైతన్యరథం

# జే బ్రాండ్లతో వేలాది మంది ప్రాణాలు తీశారు

- గత ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో దోపిడీ
- కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా మద్యం పాలసీ
- గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



తిరుపతి (చైతన్యరథం): పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావెరి సమావేశ మందిరంలో ఎక్సైజ్ అధికారుల రాష్ట్రస్థాయి సమీక్ష బుధవారం జరిగింది. గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌తో కలిసి ముందుకు వెళ్లాల్సిన విధా నాలపై చాలా విస్తృతంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2014-19 మధ్య ప్రజల కు ఇబ్బంది లేని విధంగా టీడీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి అమలు చేశా మని తెలిపారు. 2019-24 మధ్య కాలంలో ఐదేళ్లు ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేశారు. రాష్ట్రంలోని డిస్టిలరీల నుంచి మద్యం షాపుల వరకు మొత్తాన్ని హస్తగతం చేసుకున్నారు. ఎన్‌ఫోర్సుమెంట్ లేకుండా చేసి మద్యం అక్రమ వ్యాపారాలకు తెరలేపారని మండిపడ్డారు. మల్టీ నేషనల్ బ్రాండ్స్ మొత్తాన్ని మార్కెట్ నుంచి దూరం చేసి తమ సొంత బ్రాం డ్లను తీసుకొచ్చి ప్రజల నెత్తిన రుద్దారని తెలిపారు. ఏపీలో నాణ్యమైన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడంతో పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణా పెరిగింది. నాసిరకం జే బ్రాండ్లతో కిడ్నీ, లివర్ దెబ్బతిన్న లక్షల మంది అనారోగ్యం పాలయ్యారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. సరిహద్దు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు పెరగగా మన రాష్ట్రంలో మద్యం ఆదాయం కోల్పోయామని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన మద్యం పాలసీ ద్వారా నాసిరకం బ్రాండ్లకు స్వస్తి పలకడం జరిగింది. 6 రాష్ట్రాల్లో అమ లవుతున్న మద్యం పాలసీని అధ్యయనం చేసి నూతన పాలసీకి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. అత్యంత పారదర్శకంగా డిప్ నిర్వహించి మద్యం షాపులను కేటాయించినట్లు చెప్పారు. పారదర్శక లైసెన్స్ కేటాయింపు కారణంగా సుమారు 90 వేల దరఖాస్తులు రాగా రూ.1800 కోట్ల ఆదాయం వచ్చింది. పాత బ్రాండ్లను తిరిగి పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యం.. ప్రభుత్వానికి ఆదాయం కాపాడే విధంగా పాలసీని తీసుకొచ్చాం. 350కి పైగా బ్రాండ్లు ఏపీలో ప్రజలకు అందు బాటులోకి తీసుకొచ్చాం. మద్యం ధరలను కూడా పొరుగు రాష్ట్రాలతో సమానంగా చేయడం వలన అక్రమ రవాణా ఆగింది. గతంలో ఉన్న బెల్టు షాపులపై కూడా చర్యలు తీసుకోవడంతో దాదాపు నిర్మూలిం చాం. గత ఐదేళ్లూ ఎక్సైజ్ శాఖను విచ్ఛిన్నం చేసి సెబ్ ఏర్పాటు చేయడంతో ఎన్‌ఫో ర్స్‌మెంట్ కూడా సరిగా లేకుండా పోయింది. నవోదయం 2.0 ద్వారా సారా రహిత రాష్ట్రంగా ఏపీని మార్చేలా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి నిర్మూలన కోసం హోమ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసుకున్నాం. టూరిజం పెంపు కోసం త్రీ స్టార్ హోటల్‌కు లైసెన్స్ ఫీజు తగ్గించేలా నిర్ణయం తీసుకున్నాం. గతంలో మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ.32 వేల కోట్ల అప్పులు చేశారు. గత ఐదేళ్ల అక్రమాల గురించి ఆ పార్టీ నేతలే బట్టబయలు చేశారు. క్యాష్ అండ్ క్యారీ విధానంతో దాదాపు లక్ష కోట్ల లావాదేవీలు జరగడంపై సీఐడీ విచారణ జరుగుతోంది. కూటమి పాలనలో అన్ని షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ అందుబాటులో ఉంచి పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. మరోవైపు ఆన్‌లైన్ ఇండెంట్, ట్రాక్ అండ్ ట్రేస్ విధానంతో పారదర్శకతకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. బెల్ట్ షాపులు ఏర్పాటు చేసిన వారిపై, వాటికి మద్యం సరఫరా చేసిన వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

# సాక్షి తప్పుడు కథనాలపై డీజీపీకి ఫిర్యాదు



- ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా రాతలు
- టీడీపీ శ్రేణులను కించపరిచేలా వార్తలు
- నీలి మీడియాతో ప్రజాస్వామ్యానికి ముప్పు
- చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల వినతిపత్రం

అమరావతి (చైతన్యరథం): టీడీపీ క్యాడర్ మీద సాక్షిలో వస్తున్న అసత్య కథనాలపై బుధవారం డీజీపీ కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్, చిట్టిబాబు ఫిర్యాదు చేశారు. జగతి పబ్లికేషన్ ఎడిటర్స్, డైరెక్టర్లపై చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీష్‌కుమా ర్ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అవినీతి అక్రమార్జన సొమ్ముతో పుట్టిన సాక్షి అబద్ధపు రాతలతో, అసత్యాలతో సమాజంలో విషా న్ని నింపడమే పనిగా పెట్టుకుంది.. నాడు బాబాయిని గొడ్డలి వేటుకు బలి చేసి సాక్షిలో నారాసుర రక్తచరిత్ర అంటూ అసత్యాలు రాశారు. 11 సీట్లకు పరిమితం చేసి ప్రజా జీవి తానికి పనికి రారని ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా వైసీపీ నేతలను, జగన్‌ను జనం ఇంట్లో కూర్చో బెట్టినా వారికి సిగ్గు రావడం లేదు. ఇటీవల పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పశువేముల గ్రామానికి చెందిన వ్యక్తి హరిశ్చంద్ర తెలంగాణాలో ఉంటూ పింఛన్ కోసమని తన ఊరికి వస్తే.. టీడీపీ గూండాలు కిడ్నాప్ చేసి దారుణంగా హత మార్చారంటూ అసత్య వార్తలు రాశారు. అల్లుడికి, ఆయనకు మధ్య ఉన్న భూ వివాదాల కారణంగానే హత్య జరిగిందన్నది అసలు నిజం. వాస్తవాన్ని పక్కన పెట్టి టీడీపీపై బుర దజల్లడమే పనిగా సాక్షిలో విషం చిమ్ముతూ వార్తలు రాస్తున్నారు. దీనికి ఉదాహరణే అదేరోజు సాక్షి తెలంగాణ ఎడిషన్‌లోనే మామా అల్లుళ్ల మధ్య భూ పంచాయతీలో హరి శ్చంద్రను హతమార్చారని రాశారు. ఇటువంటి తప్పుడు కథనాలతో టీడీపీ, టీడీపీ నేతల ను కించపరిచేలా కథనాలు రాయడమే కాకుండా.. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే లా వారి రాతలు ఉన్నాయని ఇటువంటి అబద్ధాల పత్రిక, సాక్షి మీడియాపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు.

# ఎంఎల్‌సీసీ యాప్‌లో ఎస్‌హెచ్‌జీ డేటా

- ఇక నుంచి దాని ద్వారానే రుణాలు
- పారిశ్రామిక వేత్తలుగా మహిళలు
- బ్యాంకు అధికారులు సహకరించాలి
- మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్



తాడేపల్లి (చైతన్యరథం): మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ఆధ్వర్యంలో మెప్మా ప్రవే శపెట్టిన లోన్ చార్జి క్రియేషన్, మహిళాకాశం మాడ్యూల్స్‌పై ఎస్‌ఎల్‌బీసీ, బ్యాంక్ ప్రతి నిధులతో తాడేపల్లిలోని మెప్మా ప్రధాన కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెప్మా పరిధిలో పట్టణ ప్రాంతా లలో ఉన్న స్వయం సహాయక సంఘాల సమగ్ర సమాచారాన్ని ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌లో 2,74,078 గ్రూపులు, 28,74,000 సభ్యుల డేటా బేస్‌ను 99 శాతం సిద్ధం చేయటం జరిగిందని తెలిపారు. ఈ డేటాను బ్యాంకులకు అనుసంధానం చేయటం ద్వారా రుణ మంజూరు సమయంలో నిశిత పరిశీలనకు దోహదపడుతుందన్నారు. ఇందుకోసం మెప్మా లోన్‌చార్జి క్రియేషన్ మాడ్యూల్ (ఎంఎల్‌సీసీ) రూపొందించటం జరిగిందని చెప్పారు. ఈ డేటా బేస్ అనుసంధానం చేయటం ద్వారా గ్రూపులోని సభ్యుల వివరాలు, వారి ఆధార్ నెంబర్‌పై ఉన్న ఇతర రుణాల వెరిఫికేషన్ సులభతరమవుతుం దని వివరించారు. ఎంఎల్‌సీసీ యాప్ ద్వారా మాత్రమే బ్యాంకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు.

ర్యాపిడో సహకారానికి అభినందనలు

ఇటీవల మెప్మా చేపట్టిన ర్యాపిడో, ఈ బైక్, ఈ ఆటోలను సభ్యులకు మంజూరు చేయటంలో సహకరించిన బ్యాంకు అధికారులకు అభినందనలు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ద్వారా 4,800 మందికి వర్తింప చేయాలని లక్ష్యంగా నిర్ణయించినందున బ్యాంకు అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో 30,000 మంది మహిళా పారిశ్రామిక వేత్తలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. అందులో అంతకుముందు నుంచే వ్యాపారం చేస్తున్న 10 వేల మంది మహిళలకు మరింత శిక్షణ ఇప్పించి అత్యుత్తమ వ్యాపారవేత్తలు గా, మరో 20 వేల మంది మహిళలను కొత్త వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని బ్యాంకు ప్రతినిధులను కోరారు.

# నవజాత శిశువులపై ప్రత్యేక దృష్టి సారించాలి

## సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం - ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్



విజయవాడ (చైతన్యరథం): నవజాత శిశువుల అనారోగ్య పరిస్థితులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించింది. బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిని కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం, కుమారి ఆదిలక్ష్మి త్రిపర్ణ, జంగం రాజేంద్ర ప్రసాద్‌లు సంద ర్శించారు. ఆసుపత్రిలో గత మూడేళ్ల నుంచి నమోదైన నవజాత శిశువులు వివరాలు, వారు పొందిన వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల తల్లిదం డ్రుల తో మాట్లాడారు. అనంతరం కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రం లోని ప్రధాన ఆసుపత్రుల్లోని నవజాత శిశువుల విభాగాలను సందర్శించి వాటిల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసు చేయనున్నట్టు చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తున్న తమ కమిషన్ ఆసుపత్రుల్లో వివిధ చర్యలకు ప్రణాళికతో కమిషన్ అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. ఈ పర్యటనలో ఆసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ యు.శోభ, వైద్యులు సునీత, అశ్విని, ఖ్యాతి, సౌజన్య, శేషుబాబు, ఇన్‌చార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగాన్ని అభివృద్ధికి చర్యలు చేపట్టండి

- సంబంధిత చర్యలు చేపట్టేందుకు అంతా సమష్టిగా కృషి చేయాలి
- పర్యాటక రంగానికి పరిశ్రమ హోదాను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది
- నక్షత్ర హొటల్స్ ఏర్పాటుకు సాధ్యసాధ్యాలు పరిశీలించండి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి (చైతన్యరథం): పర్యాటక రంగానికి పరిశ్రమ హోదాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత రంగాన్ని జిల్లాలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, మార్గ నిర్దేశం చేశారు. టెక్కలిలో పట్టు మహాదేవ్ కోనేరు, భావనపాడు బీచ్, కొత్తపేట కొండ, వీటితోపాటే టెక్కలిలో దివంగత నేత మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరిట నెలకొల్పిన పార్కు అభివృద్ధికి చర్యలు చేపడుతూ సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నక్షత్ హొటల్స్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఆయా ప్రాంతాలను స్వయంగా పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించిన మంత్రి... ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేయండి. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒక మంచి వాతావరణం ఉండే విధంగా గ్రీనరీ, చిన్నారులు ఆడుకునేందుకు పార్కు, వంటివి సదుపాయాలు ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన ప్రాంతాలకు పర్యటనకు వచ్చేవారంతా ఆనందాలను పంచుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఈఈ రమణ,జెఈ మన్మధరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'లీడర్ విత్ క్యాడర్' కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు




విశాఖపట్నం (చైతన్యరథం): టీడీపీ పార్టీకీ కార్యకర్తలే కొండత అండ.. అటువంటి కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండేందుకు పార్టీ శ్రీకారం చుట్టింది.. వారి సమస్యల పరిష్కారానికి లీడర్ విత్ క్యాడర్ కార్యక్రమంతో ముందుకు సాగుతుంది. అందులో భాగంగా బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాకలోని 72 వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో వార్డ్ ఇన్‌ఛార్జ్ అక్కిన లక్ష్మణరావు నివాసంలో సమావేశం అయ్యారు. కార్యకర్తల సమస్యలతో పాటు వార్డు సమస్యలపై ఆరా తీసి.. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని.. కార్యకర్తల సంక్షేమం కోసం యువనేత లోకేష్‌బాబు, ముఖ్యమంత్రి చంద్రబాబులు నిరంతరం కృషి చేస్తున్నారని.. అందుకే గ్రౌండ్ లెవల్‌లో నాయకులు పర్యటించి సమస్యలను తెలుసుకునేందుకు నడుం బిగించినట్లు తెలిపారు. కార్యకర్తల కోసం ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటుతో పాటు.. ఆపత్కాలంలో కార్యకర్తలకు అండగా నిలుస్తున్న పార్టీ ఏదైనా ఉంది అంటే అది టీడీపీ పార్టీనే అన్నారు. అటువంటి పార్టీకీ తోడుగా ఉండి.. ప్రతి ఒక్కరూ రాష్ట్రం సంక్షేమం అభివృద్ధిలో భాగస్వాములం కావాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ రాక్షసులు చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి ప్రజారంజక పాలనకు సహకరించాలని కోరారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ఏపీ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కార ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మంచి స్పందన కనిపించింది. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వచ్చి వినతులను సమర్పించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఆలకించి సంబంధిత అధికారులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలిపారు.

## ప్రతి కార్యకర్త నాయకుడిగా ఎదగాలి : ఆదిరెడ్డి శ్రీనివాస్

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): జెండా మోసిన ప్రతి కార్యకర్త నాయకుడిగా ఎదగాలని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకాంక్షించారు. జి.ఎం.సి.బాలయోగి వంటి వారు లోక్ సభ స్పీకర్ వంటి అత్యున్నత పదవులు చేపట్టడం తెలుగుదేశం పార్టీలోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. నగర తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులు బుధవారం జె.ఎన్.రోడ్డులోని వి కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఏపీ శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, టిఎన్టీయూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, టీడీపీ నగర కమిటీ ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగర కమిటీ ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, నాయకులు మాటూరి సిద్ధు సంయుక్త సారధ్యంలో ఈ శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ 43 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తూ కార్యకర్తలలోని నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పార్టీలోకి పెద్ద సంఖ్యలో వస్తున్న యువతకు రాజకీయ అవగాహన కల్పించి వారిని నాయకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పార్టీమీద ఉందని ఆయన అన్నారు. అది గుర్తెరిగి రాజమండ్రి సిటీలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని ఇందులో మోటివేషన్ స్పీకర్స్, కౌన్సిలింగ్ సైకాలజిస్టులు డాక్టర్ గడ్డం కళాంజలి, దారపు నాగిరెడ్డి, ప్రముఖ న్యాయనిపుణులు ముప్పాళ్ళ సుబ్బారావు శిక్షణ ఇస్తారని చెప్పారు. ప్రజల్లోకి వెళ్ళినప్పుడు ఎలా మాట్లాడాలి, ప్రెస్ మీట్‌లో ఎలా మాట్లాడాలి అనేది తెలియాలని ఆయన అన్నారు. తరాలు మారుతున్నాయి, వారిఆలోచనలు మారుతున్నాయి... సోషల్ మీడియాలో దూసుకు వెళుతోందన్నారు. మారుతున్న ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి సేవలు అందించాలనే విషయమై ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు.

సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్ళు... అలాంటి ప్రజలకు ఎలాంటి సేవలు అందించాలనేది తెలియజేసేందుకు శిక్షణ తరగతులు ఉపయోగ పడతాయని అన్నారు. రాజమండ్రి సిటీ నియోజకవర్గంలో తొలిసారిగా ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని, మిగతా నియోజకవర్గాలకు ఇది ఆదర్శంగా, మార్గదర్శకంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ప్రెస్ మీట్‌లో కాని అసెంబ్లీలో కాని బూతులు మాట్లాడుతుంటే వినలేక పోయేవారమని, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాక అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షం లేకపోయినా మీరు ప్రజా సమస్యలపై చాలా చక్కగా మాట్లాడుతున్నారని ప్రజలు తనతో చెబుతున్నారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సంతోషం వ్యక్తంచేశారు. రాజమండ్రి సిటీలోని టీడీపీ కార్యకర్తల బలం వల్లనే మొన్నటి ఎన్నికల్లో తనకు 72 వేల భారీ మెజారిటీ వచ్చిందని ఇది గతంలో ఎప్పుడూ ఎవరికీ రాని కనీవినీ ఎరుగని మెజారిటీ అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. జెండా మోసిన కార్యకర్తలు నాయకులుగా ఎదగాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. త్వరలో కూటమి పార్టీల కార్యకర్తల శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని మంచి నాయకులుగా ఎదగాలని ఆయన కోరారు.

# ఘనంగా పల్లె పండుగ వారోత్సవాలు



రాజానగరం (చైతన్యరథం): నియోజకవర్గ వ్యాప్తంగా "పల్లె పండుగ వారోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద నిర్మంచనున్న గ్రామీణ రహదారులను అనేక దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలు గ్రామాల మధ్య ఉన్న రహదారులకు శాశ్వతంగా విముక్తి కల్పిస్తూ కోరుకొండ మండలం కోటి గ్రామంలో కోటి గ్రామం నుండి కోటికేశవరం గ్రామం వరకు 2.4కోట్ల రూపాయలతో నిర్మితమయ్యే సిమెంట్ రోడ్డుకు శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్ మరియ రాజనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజానగరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌ఛార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి, రాజమహేంద్రవరం జనసేన పార్టీ నగర అధ్యక్షులు యర్నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. "నా సేన కోసం నా వంతు" కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, ఎమ్మార్వో, పంచాయతీరాజ్, సంబంధిత అధికారులు, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట (చైతన్యరథం) : తెలుగుదేశంపార్టీ ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సత్యానందరావు కార్యకర్తలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సాధికారత సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ నాయకులు అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీ శ్రేణుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రామాల ప్రగతే లక్ష్యం : జ్యోతుల

గ్రామాల ప్రగతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కామరాజుపేట, కొత్తపల్లి, గోకవరం, తిరుమలా యపాలెం, మల్లవరం గ్రామాల్లో సుమారు రూ. 1.65 కోట్ల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లును ఆయన ప్రారంభించారు.

# వెలిగొండ ఆయకట్టు రైతులకు 2026 జూన్‌కి నీరు

- పనులు వేగవంతం చేసేందుకు చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): వెలిగొండ రిజర్వాయర్‌ను 2026 జూన్ కల్లా నింపి సదరు ఆయకట్టు రైతులకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పట్టుదలతో ఉన్నట్లు జల వనరుల శాఖ మంత్రి చెప్పారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమకు దిశా నిర్దేశం చేశారని ఆయన పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై, అమరావతి సచివాలయంలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో, మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వెలిగొండపై చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పరుగులు పెట్టిస్తుండగా, జగన్ హయాంలో వెలిగొండను పూర్తి చేసేసినట్లు పచ్చి అబద్ధాలు ఆడారు. జాతికి అంకితం కూడా చేసేసారు. జగన్ అబద్ధాల పాలనకు ఇది పరాకాష్ట అంటూ నిమ్మల దుయ్యబట్టారు. మోసం, దగాతో జనాల్ని భ్రమింప చేయటంలో జగన్‌ను మించిన వాడు లేడు అన్నారు. ఇప్పటి వరకు 7 వింతలే తెలుసు. చేయని పనులు చేశామని, వాటికి ప్రారంభోత్సవాలు కూడా చేసేయడం ప్రజలు ఎనిమిదో వింతగా భావిస్తున్నారని నిమ్మల ఎద్దేవా చేశారు. ఇదే తరుణంలో పాలనాదక్షత గల తమ ముఖ్యమంత్రి చంద్రబాబు 30 ఏళ్ళ క్రితం తాను ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు, ఇంకా పూర్తవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. నిర్వాసితులకు రూ.880 కోట్లు పరిహారం అందించాల్సి ఉండగా, జగన్ ఒక్క రూపాయి పరిహారం అందించ లేదన్నారు. వెలిగొండ పూర్తవ్వాలంటే ఇంకా 4వేల కోట్లు కావాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆగిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను పునరుద్ధరించిన్నట్లు పేర్కొన్నారు. టన్నెల్‌లో ఉన్న టిబిఎం మెషిన్ తొలగించడానికి కోర్టు కేసు అడ్డంకిగా ఉన్న నేపథ్యంలో, బైపాస్ టన్నెల్ నిర్మాణం, సాధ్యా సాధ్యాలపై చర్చిస్తున్నామని వివరించారు. హెడ్ రెగ్యులేటర్, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, పునరావాస కాలనీల నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. ఏది ఏమైనా 2026 జూన్ కల్లా వెలిగొండ రిజర్వాయర్ నింపి ఆయకట్టు రైతులకు నీరు అందించే దిశగా శక్తివంచన మేరకు కృషి చేస్తున్నామని చెప్పారు.

# జగన్ తీరు దారుణం : గన్ని వీరాంజనేయులు



పోలవరం (చైతన్యరథం) : పోలీసుల బట్టలు ఊడదీస్తా అంటూ జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని గన్ని వీరాంజనేయులు వ్యాఖ్యానించారు. బుధవారం పార్టీ క్యాడర్‌తో సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గం బుట్టాయిగూడెం మండలం భూసరాజుపల్లి గ్రామంలో జరిగిన పోలవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ సమావేశంలో పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్, ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సభ్యత కార్డులను ఆయా గ్రామ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ... మన స్థాయిలో పరిష్కారం అవే సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని అన్నారు. వచ్చిన అన్ని సమస్యలపై రాష్ట్ర కార్యాలయానికి తీర్మానం ద్వారా పంపడం జరుతుందని, అనంతరం జరిగిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాల్ని ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడే భాష అనుచితంగా ఉందని ఆయన ప్రవర్తన బట్టి... నాయకులు కూడా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. జగన్ పోలీసుల బట్టలు ఊడదీస్తా అంటున్నాడని, ఒక నాయకుడు తెలుగుదేశం వాళ్ళని చంపేస్తామని బెదిరుస్తున్నారని, ప్రభుత్వం వెంటనే సుమోటోగా ఫిర్యాదు తీసుకుని తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి సమపాళ్ళలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

కొమరాడ గ్రామీణ ప్రాంతాల్లో రోగ లక్షణాలను సకాలంలో గుర్తించి వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని కేఆర్బీ పురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు.

# టీడీపీ ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన

- ప్రతీ బుధవారం ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరణ




కాకినాడ (చైతన్యరథం): జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ వినతుల స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తొలిసారిగా జిల్లా కేంద్రం కాకినాడలో ప్రారంభమైన ఈ దర్బార్లో తమ సమస్యలను అందించేందుకు టీడీపీకి చెందిన కార్యకర్తలు, సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు అధికంగా హాజరయ్యారు. వీరి నుండి వినతులను తీసుకొని కార్యకర్తలకు పార్టీ నుండి, ప్రజలకు అధికారుల నుంచి ఆ సమస్యకు పరిష్కార మార్గం చూపేలా ఈ దర్బార్‌ను నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో ముందు కార్యకర్తలు కాకినాడ రూరల్, పిఠాపురం నియోజవర్గంలకు చెందిన నాయకులు టీడీపీ అధినాయకత్వం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తమ సమస్యలకు పరిష్కారం చూపించాలంటూ పట్టు పట్టడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ వారిని సముదాయించి ఇకనుండి ప్రతీ బుధవారం జిల్లాలో ఉన్న ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో దర్బార్ నిర్వహించి అక్కడ కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దాంతో వారు శాంతించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజాదర్బార్ కార్యక్రమ ప్రాముఖ్యతను అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ వివరించారు. పది నెలల్లో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్ ముగ్గురు కలిసి రాష్ట్రానికి అధిక స్థాయిలో నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేసేందుకు నాంది పలికారన్నారు. ప్రాముఖ్యత ఉన్న సమస్యను ప్రతిపక్ష వైసీపీ వారు కూడా చెప్పినా దాని పరిగణలోకి తీసుకొని అక్కడి కార్యకర్తల సూచన మేరకు పరిష్కారం చేస్తానని చెప్పారు. ముఖ్య అతిథి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ కుమార్ మాట్లాడుతూ... కార్యకర్తల్లో అసహనం ఉందని తెలిసి ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టమన్నారు. ప్రతీ బుధవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాలకు తాను హాజరయ్యేలా ప్రయత్నిస్తానన్నారు. కాకినాడ రూరల్, పిఠాపురం నియోజక వర్గంలలో ఉన్న టీడీపీ కార్యకర్తలలో అసహనం ఉందని దాన్ని సమన్వయం చేస్తానన్నారు. తనకు ఎంపీ లాండ్స్ అందాయని ఈ నిధులతో ఎదిగే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారుచేసి ఇంకా వారిలో నైపుణ్యం పెంచేందుకు వీటిని వినియోగిస్తానని చెప్పారు. ఇంకా కాకినాడతో పాటు హైదరాబాదులో ఉన్న పారిశ్రామిక వేత్తలతో తనకు సంబంధాలు ఉన్నాయని నిరుద్యోగ సమస్య తీర్చి ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తానని సతీష్ చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యే నిమ్మకాయ చినరాజప్పలు ప్రసంగించారు.

# రైతుల సంక్షేమానికి కృషి చేయాలి : గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు (చైతన్యరథం): రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, రైతుల సంక్షేమానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె నూతనంగా ఏర్పడిన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యవర్గాన్ని అభినందించారు. చైర్మన్ ముఖీ సూర్యనారాయణతో పాటు సభ్యులను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యవ సాయ రంగం అభివృద్ధికి మార్కెటింగ్ కమిటీ కీలక పాత్ర పోషించాల న్నారు. అప్పగించిన బాధ్యతను అంకితభావంతో పని చేసి నియోజకవ ర్గానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకోని రావాలని కోరారు. కార్యక్ర మంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, చలుమూరి వెంకటరమణ, పరమేష్, గుడేపు యుగంధర్, వాడాడ శోభారాణి, అప్పయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఆగిరిపల్లిలో సీఎం పర్యటన



ఆగిరిపల్లి (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా బలహీనవర్గాలకు, వృత్తిదారులకు పనిముట్లు, రుణాలు పంపిణీ చేయనున్నట్లు గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ నెల 11న ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలసి మంత్రి పరిశీలించి, ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని రాష్ట్రస్థాయి ఉత్సవంగా ఆగిరిపల్లిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరై బలహీనవర్గాల జీవనోపాధికి అవసరమైన పనిముట్లు, రుణాలను పంపిణీ చేస్తారు. వారి వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటా రని మంత్రి చెప్పారు. ఆగిరిపల్లి శివారు వడ్లమానులో హెలిప్యాడ్, బహిరంగ సభకు అధికారులు ప్రతిపాదించిన ప్రదేశాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా బహిరంగ సభలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీరు, టెంట్లు, కుర్చీలు ఏర్పాట్లు చేయాలన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : చింతమనేని ప్రభాకర్

దెందులూరు (చైతన్యరథం) : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పేద ప్రజల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యానించారు. బుధవారం పోతునూరు గ్రామంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని పలు సీసీ రోడ్లు నిర్మాణం శంకుస్థాపన, రైతులకు ట్రాక్టర్ల పంపిణీ సహా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. పోతునూరు సొసైటీ భవనంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక స్వరాజ్ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతునూరు గ్రామానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి దెందులూరు మండల పార్టీ అధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.



# సాక్షి తప్పుడు కథనాలపై డీజీపీకి ఫిర్యాదు

**•టీడీపీ క్యాడర్‌ను కించపరిచేలా... సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా తప్పుడు కథనాలు రాస్తున్న సాక్షిపై చర్యలు తీసుకోవాలని వినతి**



అమరావతి (చైతన్యరథం): టీడీపీ క్యాడర్‌పై సాక్షిలో వస్తున్న అసత్య కథనాలపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీజీపీ కార్యాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాంప్రసాద్, చిట్టిబాబులు... జగతి పబ్లికేషన్ ఎడిటర్స్ అండ్ డైరెక్టర్లపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు ఫిర్యాదు చేశారు. సాక్షి పత్రికలో వచ్చిన అసత్య కథనాలను చూపిస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. అవినీతి అక్రమార్జన సొమ్ముతో పుట్టిన సాక్షి అప్పటి నుండి నేటి వరకు అబద్దపు రాతలతో అసత్యాలతో సమాజంలో విషాన్ని నింపడమే పనిగా పెట్టుకుంది.. నాడు బాబాయిని గొడ్డలివేటుకు బలి చేసి సాక్షిలో నారాసుర రక్త చరిత్ర అంటూ అసత్యాలు రాశారు. 11 సీట్లకు పరిమితం చేసి ప్రజా జీవితానికి పనికిరారని ప్రతి పక్ష హోదా కూడా ఇవ్వకుండా వైసీపీ నేతలను, జగన్‌ను జనం ఇంట్లో కూర్చో బెట్టినా వారికి సిగ్గు రావడంలేదు. ఇటీవల పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పశువేముల గ్రామానికి చెందిన వ్యక్తి హరిశ్చంద్ర తెలంగాణాలో ఉంటూ.. పింఛన్ కోసమని తన ఊరికి వస్తే.. టీడీపీ గూండాలు కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చారంటూ సాక్షిలో అసత్య వార్తలు రాశారు.. అసలు నిజం తన అల్లుడికి తనకు మధ్య ఉన్న భూ వివాదాల కారణంగా హత్య జరిగింది.. వాస్తవాన్ని పక్కన పెట్టి టీడీపీపై బురద చల్లడమే పనిగా సాక్షిలో విషం చిమ్ముతూ వార్తలు రాస్తున్నారు... దీనికి ఉదాహరణే అదే రోజు సాక్షి తెలంగాణ ఎడిషన్ లోనే మామా అల్లుళ్ల మధ్య భూ పంచాయితీలో హరిశ్చంద్రను హతమార్చారని రాశారు.. ఇటువంటి తప్పుడు కథనాలతో టీడీపీ, టీడీపీ నేతలను కించపరిచేలా కథనాలు రాయడమే కాకుండా.. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టేలా వారి రాతలు ఉన్నాయని.. ఇటువంటి అబద్ధాల పత్రిక, సాక్షి మీడియాపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ఉప్పలమ్మ తల్లి దీవెనలు ఉండాలి :యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధికి ఉప్పలమ్మ తల్లి దీవెనలు ఉండాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. టీడీపీ నాయకులు కాసరనేని రాజా మైలవరం మండలం, చంద్రాల గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉప్పలమ్మ తల్లి -ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట చేసి కళ్యాణోత్సవం జరిపారు. ఈ సందర్భంగా బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ వెంకట్రావు ఉప్పలమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గన్నవరం నియోజకవర్గ ప్రజల సుఖశాంతులతో ఉండాలని, నియోజవర్గంతో పాటు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. తల్లి ఆశీస్సులతో గన్నవరం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భోజనానంతరం ఆయన విజయవాడ తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమా ప్రసాద్, కొమ్మారెడ్డి రాజేష్, దుట్టా శ్రీమన్నారాయణ, కాటూరు విజయవాడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 200 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కారంచేడు (చైతన్యరథం): అక్రమంగా తరలిస్తున్న ప్రజాపంపిణీ బియ్యాన్ని కారంచేడు పోలీసులు పట్టుకున్నారు. సాయంత్రం సమయంలో గ్రామ సమీపంలోని రామానాయుడు కల్యాణ మండపం వద్ద ఎస్సై వెంకట్రావు, వీఆర్వోలు పి.వి కోటేశ్వరరావు, వి.శివశంకర్లు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో చీరాల వైపు నుంచి పర్చూరు వైపు వెళ్తున్న హైచర్ లారీ డ్రైవర్ తీరు అనుమానంగా కనిపించటంతో అదుపులోకి తీసుకుని, పోలీస్టేషన్కు తరలించారు. వాహనాన్ని పరిశీలించగా 50 కేజీలతో కూడిన 200 బస్తాల రేషన్బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గుర్తించారు. డ్రైవర్ కె.సాంబశివరావును విచారించగా వేటపాలెం మండలం జాండ్రపేట, దేశాయిపేట, దంతంపేట ప్రాంతాల నుంచి బియ్యాన్ని నరసరావుపేటకు తరలిస్తున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. సమాచారాన్ని రెవెన్యూ శాఖ అధికారులకు అందించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై వి.వెంకట్రావు చెప్పారు.

# పెమ్మసాని చొరవతో బస్ రూట్ పునరుద్ధరణ

**◆ బస్ రూట్ పునరుద్ధరించాలంటూ పేరేచర్ల, పెదపలకలూరు ప్రజల విజ్ఞప్తి**

**◆ ఆర్టీసీ అధికారులకు సూచించిన పెమ్మసాని**



గుంటూరు (చైతన్యరథం): "పెదపలకలూరు, పేరేచర్ల మీదుగా గుంటూరు – విజయవాడ రాకపోకలకు వీలుగా పేరేచర్ల నుంచి పల్లె వెలుగు బస్సు రూట్‌లను పునరుద్ధరించండి." అని ఆదేశించిన పెమ్మసాని చొరవతో ఆర్టీసీ అధికారులు పేరేచర్ల నుంచి గుంటూరు – విజయవాడకు ప్రత్యేక బస్సు రూట్‌లను పునరుద్ధరించారు. గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని ఆయన కార్యాలయంలో పేరేచర్ల – పెదపలకలూరు ప్రజలు ఇటీవలే కలిసి వినతులు సమర్పించారు. పేరేచర్ల నుంచి ఆర్టీసీ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఉద్యోగాలు, పలు వ్యాపారాల నిమిత్తం గుంటూరు, విజయవాడకు రాకపోకలకు వీలుగా సహకారం బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆయా ప్రాంత ప్రజలు ఈ సందర్భంగా పెమ్మసానిని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన పెమ్మసాని ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి పేరేచర్ల, పెదపలకలూరు, గుజ్జనగుండ్ల, కొరిటెపాడు, లాడ్జి సెంటర్ మీదుగా గుంటూరు – విజయవాడకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. పెమ్మసాని సూచనల మేరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన అధికారులు రోజుకు 15 ట్రిప్పులను నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఆయా బస్సు ట్రిప్పుల సమయాలను కూడా వెల్లడిస్తూ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.రవికాంత్ ఇటీవలే ప్రకటన కూడా నిర్వహించారు. ప్రజా వినతుల మేరకు తక్షణమే స్పందించి, అధికారులను అప్రమత్తం చేస్తూ, బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన పెమ్మసాని చొరవకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేరుకే పరామర్శ .. ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలే : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): "చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించే పేరుతో జగన్ ఆడిన నాటకం, పోలీస్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య భావజాలానికి, అహంకారానికి నిదర్శనాలనే చెప్పాలి" అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వ్యక్తి, కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, స్థానిక నాయకుల సమస్యలు విని వారిలో భరోసా నింపాలి. కానీ రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్‌ను తలదన్నిందనే చెప్పాలి. పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలే. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు, ప్రజాస్వామ్యంలో ప్రజల రక్షణబాధ్యతల్లో తలమునకలైన పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చగా నిలిచాయి. మహిళా పోలీస్ అధికారులు ఆ జిల్లాలో విధి నిర్వహణలో ఉన్నారని తెలిసీ జగన్ అలా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. పోలీసులు సరిగా పనిచేయకపోతే జగన్ రాప్తాడులో స్వేచ్ఛగా పర్యటించి, యధేచ్ఛగా నోరు పారేసుకోగలిగేవాడా? తన పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ వద్ద, పాపిరెడ్డి పల్లె చుట్టూ రక్షణగా నిలిచిన వందలమంది పోలీసులు జగన్‌కు కనిపించలేదా? పోలీస్ వ్యవస్థ జగన్ తీరుని ఏమాత్రం ఉపేక్షించకూడదు. తమపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా జగన్ క్షమాపణ చెప్పేవరకు రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పోరాడాలి. ఆయన తన తప్పు తెలుసుకునేలా చేసి, పోలీసుల పవర్ ఏంటో తెలియచేయాలి. అప్పుడే మరోసారి వైసీపీ అధినేత ఒళ్లుతెలియకుండా వ్యవహరించడు. వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పోలీసుల్ని డ్యూటీ సక్రమంగా చేయమంటే, తమను ఏదో అన్నారని గొంతుచించుకున్న పోలీస్ అధికారుల సంఘం తక్షణమే జగన్ వ్యాఖ్యలపై న్యాయస్థానాల్ని ఆశ్రయించాలి. ఖాకీలను తూలనాడితే తలెత్తే పర్యవసానాలు, పరిణామాలు తెలిసొచ్చేలా కఠిన శిక్ష పడేలా చూడాలి. సాటి మహిళా పోలీస్ సిబ్బందిని దూషించిన వ్యక్తికి ఇప్పుడు బుద్ధిచెప్పకపోతే, అతన్ని ఆదర్శంగా తీసుకొని మునుముందు వైసీపీ శ్రేణులు రెట్టింపు మదంతో రెచ్చిపోతారనే వాస్తవాన్ని పోలీస్ ఉన్నతాధికారులు గ్రహించాలి." అని ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు.

## టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు, పార్టీ నేతల నుండి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా మున్సిపాలిటిలో అవుట్‌సోర్స్ ప్రాతిపదికన పనిచేసే పారిశుధ్య కార్మికులను తమ ప్రాంతానికి దూరంగా విధుల వేయటం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, తమను యథాస్థానంలో ఉంచేలా చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అదేవిధంగా ఏపీ కుమ్మరి శాలివాహన కమిటి సభ్యులు "శాలివాహన చక్రవర్తి" విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనీ కోరుతూ వినతి పత్రం అందజేసారు. ప్రజలు తమ ప్రాంతాల్లో పలు సమస్యల గురించి వినతిపత్రాలు అందజేయగా వీటన్నిటి పరిశీలించి, త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు. తొలుత గుంటూరు కోరిటెపాడు రామాలయంలో శ్రీరాముల వారిని ఎమ్మెల్యే గల్లా మాధవి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లాలో అకాల వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం

ఎన్టీఆర్ జిల్లా (చైతన్యరథం): అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో ప్రకృతి కోలుకోలేని దెబ్బకొడుతోంది. వర్షాలు, ఈదురుగాలులతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. కృష్ణా జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు పడుతుండడంతో కోతలు కోసి పంట ఆరబోసిన అన్నదాతలకు వరుణ భయం పట్టుకుంది. ఎన్టీఆర్ జిల్లాలో అకాల వర్షాలకు మామిడి, అరటి, బొప్పాయి, మునగ, మొక్కజొన్న పంటలు నేలరాలాయి. మరోవైపు ఆరబెట్టిన వరి ధాన్యం తడిసిపోతుండడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



దగదర్తి మండలం, పెదపుత్తేడు గ్రామ వాస్తవ్యులు వడ్లమూడి ప్రసాద్, శీనమ్మల కుమారుని వివాహం సందర్భంగా తాళిబొట్టును ప్రదానం చేస్తున్న దగదర్తి మండల మాజీ జెడ్పిటిసి మాలేపాటి పద్మావతి కుటుంబ సభ్యులు

# స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి

గిద్దలూరు, (చైతన్యరథం): ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా అవినీతి, అరాచకాలే జరిగాయని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుందని అన్నారు. గత పాలనలో అనారోగ్యంతో బాధపడే పేదలకు ముఖ్య మంత్రి సహాయం నుండి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనారోగ్యంతో బాధపడే పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. గృహాలు లేని వారికి



పక్కా గృహాలు మంజూరు చేస్తున్నామన్నారు. చెప్పిన మాట ప్రకారం ప్రతి నెల 1వ తేదీన పెంచిన పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో రోడ్లు, త్రాగునీటి సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామన్నారు. అయితే చేసిన ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలని, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేస్తే ప్రజలే తమకు పట్టం కడతారన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యకర్తలంతా సమాయత్తం కావాలని ప్రతి గ్రామంలో, ప్రతి బూతులో సమష్టిగా కృషి చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో అసాధ్యం అనుకున్న విజయాన్ని, సుసాధ్యం చేసిన ఘనత కార్యకర్తలదేనని, టీడీపీ కార్యకర్తల కృషి పట్టుదలతోనే నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ తెలుగుదేశం అధికారంలో ఉందని, కష్టపడిన ప్రతి కార్యకర్తను తాను గుర్తు పెట్టుకుంటానని, వారికి తగిన ప్రాధాన్యతను ఇస్తానని తాను ఎల్లప్పుడూ మీ వాడిగా మీఇంటి వాడిగా నీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు క్లస్టర్ ఇన్చార్జ్ లు, మండల నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో అన్నదాతల కళ్ళల్లో ఆనందం

## ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ధన్యవాదాలు

కోవూరు, (చైతన్యరథం): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి ప్రత్యేక చొరవ కారణంగానే వరి ధాన్యం విక్రయించిన 24 గంటలలో ప్రబుత్వం రైతులకు డబ్బులు చెల్లించిందంటున్నారు కోవూరు నియోజజకవర్గ రైతులు. విడవలూరు మండల కేంద్రంలో రైతులు, రైతు సంఘ నాయకుల ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేస్తూ మాతూరు శ్రీనివాసులు రెడ్డి, పోలిరెడ్డి అశోక్ రెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, మడపర్తి చంద్రమోహన్ గార్ల ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రైతులు కలక్టరేట్ వద్ద ధర్నాలు చేస్తే గానీ ధాన్యం డబ్బుల వచ్చేవి కావన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో 24 గంటలలోనే ధాన్యం అమ్మిన డబ్బులు రైతుల ఖాతాలో జమ అవడం పై వారు హర్షం వ్యక్తం చేశారు. ఇందంతా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి చొరవ కారణంగానే సాధ్యమైందన్నారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డి పాళెం మండలం నుంచి 4 వేల టన్నుల 375 క్వింటాళ్లు, కోవూరు మండలం నుంచి 10 వేల



894 క్వింటాళ్లు, కొడవలూరు మండలం నుంచి 8 వేల 595 క్వింటాళ్లు, విడవలూరు మండలం నుంచి 11 వేల 244 క్వింటాళ్లు మరియు ఇందుకూరుపేట మండలం నుంచి 2 వేల 533 క్వింటాళ్లు ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం దాదాపు 83 వేల టన్నుల ధాన్య సేకరణ జరిగితే ఒక్క కోవూరు నియోజకవర్గం నుంచే రికార్డు స్థాయిలో 37 వేల టన్నుల 621 క్వింటాళ్ల ధాన్య సేకరణ చేయడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఎన్నికలప్పుడు అన్నదాతలను ఆదుకుంటామని చేసిన హామీ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నిలబెట్టుకున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో లారీల కొరత, ఖాళీ గోనె సంచులు దొరకక అన్నదాతలు అల్లాడే వారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారి ప్రత్యేక చొరవతో ఈ సంవత్సరం ఎలాంటి యిబ్బందులు రాలేదన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తూ క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చి సహకరించిన ఎమ్మెల్యే గారికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, జిల్లా అధికారుల సంపూర్ణ సహకారంతో 80 శాతం మంది రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకున్నారన్నారు. ఈ సమావేశంలో గునపాటి వరదారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మాతూరు ప్రభాకర్ రెడ్డి, గోపి, మడపర్తి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన

# ఎరుకలయ్య కుటుంబానికి టీడీపీ అండ..!

కొండాపురం, (చైతన్యరథం): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుంకు ముడుసు ఎరుకలయ్య కు (40) తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. కొండాపురం మండలం సాయి పేట పంచాయతీ చెందిన దామా శివబాబు జరిగిన ప్రమాదం గురించి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు తెలియజేశారు. పేద కుటుంబం, తెలుగుదేశం కుటుంబ సభ్యుడు అని తెలియపరచగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ. 15 వేలు ఆర్థిక సహాయం చేయడంతో పాటు కొండాపురం మండలం నాయకులకు కుంకు ముడుసు కుటుంబానికి అండగా నిలవాలని, వారికి భరోసా కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. టిడిపి పార్టీ బీమా వర్తించే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. స్థానిక నాయకుల సహకారంతో దామ శివ బాబు నాయకులతో కలిసి మృతుని నివాసానికి చేరుకున్నారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ప్రమాదం కేసుగా నమోదు చేయించి, పోస్టుమార్టం రిపోర్ట్ తదితర అంశాలు తీసుకోవాల్సిన చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. మృతునిది కొండాపురం మండలం సాయి పేట పంచాయతీ కొమ్ము పాలెం గ్రామం మంగళవారం కందుకూరు నియోజకవర్గం లోని చిన్నపౌను గ్రామానికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి క్రింద పడింది. దీంతో తీవ్ర గాయాలైన ఆయనను 108 ద్వారా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలోనే మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుంకుముడుసు ఎరుకలయ్య టిడిపి సభ్యత్వం పొంది ఉన్నారు. దీంతో ప్రమాద బీమా సుమారు 5 లక్షల వరకు వచ్చే అవకాశం ఉంది. బీమా వర్తించేందుకు కావలసిన రిపోర్టులను సిద్ధం చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు బీమా వర్తించేందుకు కృషి చేస్తామన్నారు. స్థానిక టిడిపి నాయకులు దామా శివబాబు అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఘనంగా టీడీపీ నేత కృష్ణ కిషోర్ జన్మదిన వేడుకలు

# అన్నా కేంటీన్‌లో అన్నదానం

గిద్దలూరు, (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు గౌ. శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వారి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు తెలుగుదేశం కార్యకర్తలు వారికి పూలమాల శాలువాలు వేసి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# నెల్లూరు నగరాభివృద్ధి విషయంలో రాజీ ప్రసక్తే లేదు

## పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

నెల్లూరు, (చైతన్యరథం): రూ.37 కోట్ల నిధులతో నెల్లూరు నగరంలో డ్రైనేజీలు, రోడ్లను బాగు చేస్తామని, నిరుపేద ముస్లిం మైనార్టీలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు రూ.50 లక్షల సొంత నిధులతో షాది మందిల్ నిర్మాణం చేపట్టనున్నట్టనునామని, అలాగే కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందని, నెల్లూరు నగర అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అధికారులతో, పార్టీ నేతలతో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తాను ఎన్నికల సందర్భంగా 54 వ డివిజన్ లో పర్యటించిన సమయంలో స్థానిక ప్రజలకు షాదీ మంజిల్ నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. షాదీ మంజిల్ నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని అందుకోసం తన సొంత నిధుల నుండి 50 లక్షలు కేటాయించడం జరిగిందని మంత్రి నారాయణ తెలిపారు. 2014-19 లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా నగరంలో ప్రజల దాహార్తిని తెచ్చేందుకు వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల స్వచ్ఛమైన రక్షిత త్రాగునీరు అందించామన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆయా యూనిట్లను నాశనం చేసిందని, తిరిగి వాటిని పునరుద్ధరించే క్రమంలో 4 .8 కోట్లతో




ఎన్టీఆర్ సుజలస్రవంతి కి శ్రీకారం చూడుతున్నామన్నారు. నెల్లూరు నగర పరిధిలో మొత్తం 3 మదర్ ప్లాంట్లు ,60 డిస్పెంన్సి0గ్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆగస్టుకల్లా మరో రెండు మదర్ ప్లాంట్స్ ,47 డిస్పెంన్సి0గ్ యూనిట్లురానున్నాయని మంత్రి చెప్పారు. ప్రతీ ఇంటికీ 2 రూపాయలకే 20 లీటర్ల మంచినీటిని డిస్పెంన్సి0గ్ యూనిట్ల ద్వారా అందిస్తామన్నారు. నగరంలో మూడు విడతలుగా డ్రైనేజీ, రోడ్డు పనులు చేపట్టనున్నామని, రూ.37 కోట్లుతో నగరంలోని చిన్న డ్రైన్లన్నీ పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. మొదటి విడతగా 15 వ ఆర్థిక సంఘం నిధులతో 11 .75 కోట్లతో చిన్న డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు మరో 17 .7 కోట్లతో రోడ్ల పనుల%శ్రీ%ను త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.నెల్లూరు అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఒకదాని తర్వాత ఒకటి చేస్తామని నారాయణ మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నేరవేరుస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తామని మంత్రి చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో కార్పొరేషన్ కమీషనర్ సూర్యతేజ ,ఇంజినీరింగ్ అధికారులు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ ,మాజీ జడ్పీటిసి విజేతా రెడ్డి, మాజీ కార్పొటటర్లు మామిడాల మధు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా దర్బార్‌లో సమస్యల పరిష్కారం



బెలుగుప్ప, (చైతన్యరథం): ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తో కలిసి అర్జీలను స్వీకరించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బెలుగుప్ప మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపం పక్కన ఉన్న స్థలంలో బుధవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓ వసంతబాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, ఎంపిపి పెద్దన్న, సర్పంచ్ సాలీబాయి, వైస్ ఎంపీపీ పుష్పావతి, ఎంపీటీసీ శకుంతలమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారుల పాల్గొన్నారు.



**కడపలో...**

కడప, (చైతన్యరథం): కడప నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం బుధవారం ప్రజాదర్బార్ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుండి విన్నతులు స్వీకరించారు. అత్యవసరమైన వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సిఫార్సు చేయడం చేశారు. మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.



**శ్రీశైలంలో...**

బండి ఆత్మకూరు, (చైతన్యరథం): స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వినతులు స్వీకరించారు. వ్యక్తిగత, సామాజిక అంశాలపై అర్జీలను ఎమ్మెల్యే ప్రజల నుంచి స్వయంగా స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే నిర్ణీత గడువులోగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఒక మండల కేంద్రంలో జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయా మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందన్నారు. నమ్మకంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్డీయే కూటమికి ప్రజలు అవకాశం కల్పించారని వారి నమ్మకాన్ని వమ్ముచెయ్యమని పేర్కొన్నారు. బండి ఆత్మకూరు మండలానికి గత వైసీపీ పాలనలో శిల్పా చక్రపాణి రెడ్డి చేసింది శూన్యం.. ఎక్కడ లేని హామీలన్నీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఏటా రెండు పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే రూ 20 కోట్లతో



గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**నందికొట్కూరులో...**

నందికొట్కూరు, (చైతన్యరథం): పాములపాడు మండలం ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యల వినతులను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగులో....**

జమ్మలమడుగు, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని జమ్మలమడుగు నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి శ్రీ చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామి రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదును స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



**పుట్టపర్తిలో...**

పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులతో కలిసి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై నేరుగా ప్రజలు ఇచ్చిన అర్జీలు స్వీకరించారు.



## ఇది మంచి ప్రభుత్వం నినాదానికి స్పందన

**ఆసుపత్రికి ఫ్రిజ్ విరాళమిచ్చిన దాతలు అభినందించిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ**

శింగనమల, (చైతన్యరథం): శింగనమల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో స్థానిక ఎమ్మెల్యే, ఆస్పత్రి కమిటీ చైర్మన్ బండారు శ్రావణి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఆస్పత్రిలో చేయవలసిన అభివృద్ధి, వేసవికాలంలో రోగులకు సమకూర్చవలసిన సౌకర్యాలు గురించి కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే బండారు శ్రావణి చర్చించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఔషధాలు నిల్వ ఉంచే ఫ్రిజ్ లేదని విమర్శించారు. ఈ విషయమై "ఇది మంచి ప్రభుత్వం"లో భాగస్వామ్యం కావాలనే పిలుపు మేరకు దాతలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి ఫ్రిజ్ ను ఇచ్చారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఫ్రిజ్ ను ప్రారంభించారు. ఇది మంచి ప్రభుత్వానికి చేయూత నిచ్చే దిశగా ఫ్రిజ్ ను ఇచ్చిన దాతలను ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అభినందించారు.



## ఆసుపత్రిలో కానిస్టేబుల్‌కు మడకశిర ఎమ్మెల్యే పరామర్శ

అనంతపురం, (చైతన్యరథం): రాప్తాడులో జగన్ పర్యటనలో హెలిప్యాడ్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రంగారెడ్డి అనే కానిస్టేబుల్ అస్వస్థతకు గురై అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్ రాజు ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి త్వరగా కోలుకునే విధంగా మంచి వైద్యం అందించాలని వారికి సూచించారు. బాధిత కానిస్టేబుల్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## నూరుగొడ్లను తిన్న రాబందు జగన్

**రామగిరి పర్యటనతో అరాచకం, ఎమ్మెల్యే సింధూర, మాజీమంత్రి పల్లె ధ్వజం**

పుట్టపర్తి, (చైతన్యరథం): వైఎస్ జగన్ పర్యటనపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. హెలికాప్టర్ మొరాయింపు అని జగన్ పెద్ద డ్రామా ఆడాడన్నారు. మొరాయించిన హెలికాప్టర్ బెంగళూరుకు ఎలా వెళ్లిందో జగన్ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. 5కోట్ల 50 లక్షలు ఖర్చు పెట్టి పాపిరెడ్డిపల్లి పర్యటనా జగన్ అని ప్రశ్నించారు. లింగమయ్య కుటుంబానికి నయా పైసా ఇవ్వకుండా చిన్న గ్రామంలో రాజకీయ రంగు పులమడం దిగజారుడు రాజకీయానికి అద్దం పడుతోందన్నారు. ఇదేనా నీవు చేసిన న్యాయం అని నిలదీశారు. ఫ్యాక్షన్ లేని జిల్లాల్లో మళ్ళీ విధ్వంసం సృష్టించాలన్నదే జగన్ ఉద్దేశ్యమన్నారు. రెండు కులాల మధ్య చిచ్చు పెట్టడానికే జగన్ పర్యటన అన్నారు. కురుబ లింగమయ్య కుటుంబానికి ఏమి న్యాయం చేశారో చెప్పాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, మహిళలపై జరుగుతున్న దాడులు, మానభంగాలు, కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరిగితే జగన్ ఏనాడు పరామర్శించలేదన్నారు. జగన్ పర్యటనకు కూటమి ప్రభుత్వం 1100 మంది పోలీసులు, 2ఎస్పీ లు , ఏ ఎస్పీలు ,8 మంది డీఎస్పీలు ఒక డిఎస్పీ ఆధ్వర్యంలో 250 మంది హెలిప్యాడ్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. రక్షణగా వచ్చిన పోలీసులను రోడ్డుపై బట్టలు ఊడతీసి నిలబెడతాం అని మాజీ ముఖ్యమంత్రి జగన్ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. జగన్ పర్యటన మొత్తం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, రామగిరి ఎస్ఐ లే టార్గెట్ గా ఎంచుకున్నాడన్నారు. స్వంత చెల్లెలు షర్మిల, తల్లి విజయమ్మకే న్యాయం చెయ్యలేని స్థితిలో ఉన్నాడన్నారు. కనీసం చిన్నాన్న వై యస్ వివేకా హత్యకు గురైతే ముఖ్యమంత్రిగా ఏమి చేసావన్నారు. జగన్ ముఖ్యమంత్రి స్థాయిలో పనిచేసిన వ్యక్తి పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బ తీసేలా కించపరిచే విధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. బేషరతుగా జగన్ పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాన్ని జగన్ కోల్పోయారన్నారు. జగన్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇప్పటికైనా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తన తీరు మార్చుకుని ప్రజల కోసం పనిచేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హితవు పలికారు.



## అనంత మార్కెట్ అంతా మోసమే

అనంతపురం, (చైతన్యరథం): మార్కెట్ యార్డులో చీనీ రైతులకు జరుగుతున్న మోసంపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఉగ్రరూపం దాల్చారు. ఇవాళ ఉదయం ఆయన మార్కెట్ యార్డును సడన్ విజిట్ చేశారు. ఇక్కడ గత కొన్ని రోజులుగా కేవలం ఐదు మంది వ్యాపారులు మాత్రమే ఆన్లైన్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. బయట మార్కెట్లలో టన్ను చీనీ 50 వేలు ఉండగా ఇక్కడ 20 నుంచి 25 వేల మధ్య మాత్రమే వచ్చేలా చూస్తున్నారు. అందులో రైతుల మధ్య పోటీ పెడుతూ వారిని దగా చేస్తున్నారు. దీనిపై గత నెల రోజులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి తన సిబ్బందితో నిఘా ఉంచారు. పండ్లతోట రైతు సంఘాలు, సిపిఐ నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. బుధవారం ఆయన ఆకస్మికంగా మార్కెట్ యార్డ్ ని తనిఖీ చేసి అక్కడ మోసాలని బట్టబయలు చేశారు. విషయం తెలుసుకున్న సిపిఐ, రైతు సంఘం నాయకులు కూడా అక్కడికి చేరుకున్నారు. అక్కడున్న మార్కెట్ యార్డ్ సెక్రటరీ



పై ఎమ్మెల్యే దగ్గుపాటి నిప్పులు చెరిగారు. ఇక్కడ ఎంతమంది వ్యాపారులు పంట కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా.. 42 మంది దాకా ఉన్నారని చెప్పారు. దీంతో గత నెల రోజుల నుంచి జరిగిన వ్యాపారం రికార్డులన్నీ బయటకి తీశారు. కేవలం ఐదు మంది మాత్రమే ఇక్కడ పంట కొనుగోలు చేస్తున్నారని.. మిగిలిన వారు ఏమయ్యారని నిలదీశారు. మరోవైపు రైతుల నుంచి నిబంధనల ప్రకారం 4శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉండగా 10% వరకు వసూలు చేస్తున్నారని రైతులు చెప్పారు. దీంతో ఆయన మార్కెట్ యార్డ్ సెక్రటరీని నిలదీశారు. అయితే దీనిపై తనకు సమాచారం లేదని చెప్పగా ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పట్టు వదలని భారత్

# చంద్రునిపై కాలెట్టడం ఖాయం



చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలతో ప్రపంచానికి తన సత్తాను చూపిన భారత్.. జాబిల్లిపై సొంత వ్యోమగామిని దించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. 2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగామి కాలుమోపుతాడని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ ఆంగ్ల ఛానల్ ఏర్పాటు చేసిన 'రైజింగ్ భారత్ సమ్మిట్ 2025'లో ఆయన పాల్గొన్నారు. భారత అంతరిక్ష భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు. భారత్ తన సొంత అంతరిక్ష కేంద్రం 'భారత్ స్పేస్ స్టేషన్' ను 2035 నాటికి సమకూర్చుకుంటుందని ఆయన వెల్లడించారు.

ఇక చంద్రయాన్-3 మిషన్లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగిన విషయం తెలిసిందే. భారత వైజ్ఞానిక సత్తాను ఇది ప్రపంచానికి చాటింది. దీంతో చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరుకున్న తొలి దేశంగా రికార్డు సృష్టించింది. ఇప్పుడు చంద్రయాన్-4 పై దృష్టిసారించింది. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని 2027లో చేపట్టనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎల్వీఎం-3 రాకెట్‌ను కనీసం రెండుసార్లు ప్రయోగించి, చంద్రయాన్-4 మిషన్‌కు సంబంధించిన ఐదు భిన్న భాగాలను నింగిలోకి పంపిస్తారు. వాటిని కక్ష్యలోనే బిగిస్తారు. చంద్రుడిపైకి భారత వ్యోమగామిని పంపించేంత వరకు చంద్రయాన్ శ్రేణి ప్రయోగాలు కొనసాగుతూనే ఉంటాయని ఇస్రో ఇప్పటికే వెల్లడించింది. ఇక భారత తొలి మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్ యాన్‌ను వచ్చే ఏడాది చేపట్టనున్నారు.

## బంగ్లా మంత్రి నిర్వాకం.. భారత్ స్పందన మరింతతీవ్రం



షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన దగ్గరి నుంచి భారత్-బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఇటీవల చైనా పర్యటనలో బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ చేసిన వ్యాఖ్యల వేళ కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఆ దేశానికి ఉన్న ట్రాన్స్ షిప్మెంట్ సౌకర్యాన్ని రద్దుచేసింది. కొన్ని రోజుల క్రితం చైనా పర్యటనకు వెళ్లిన యూనస్ భారత్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మన నేతల ఆగ్రహానికి కారణమయ్యాయి. "భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలు పూర్తిగా భూపరివేష్టితమైవున్నందున బంగాళాఖాతానికి మేమే సంరక్షకులం. ఇదొక పెద్ద ప్రయోజనాలకు అవకాశం కల్పిస్తోంది. అందుకే మా దేశంలో పెట్టుబడులు పెట్టండి" అని యూనస్ చైనాను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బంగ్లా ఎగుమతుల నిమిత్తం 2020లో ఇచ్చిన ట్రాన్సిషిప్మెంట్ సదుపాయాన్ని రద్దు చేస్తూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ ఉత్తర్వులు ఇచ్చింది. "జూన్ 29, 2020 తేదీన ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించింది. అయితే భారత్‌లోకి ఇప్పటికే ప్రవేశించిన కార్గో రవాణాకు అనుమతి ఉంది" అని పేర్కొంది. 2020 ఉత్తర్వుల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన ఎగుమతులు భారత్ మీదుగా (భూ, జల, వాయు మార్గాల్లో) నేపాల్, భూటాన్, మయన్మార్ వెళ్లడానికి అనుమతి ఉంది. ఇప్పుడు దీనిని రద్దు చేయడం వల్ల భారత్‌కు పయోజనం చేకూరనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. టెక్స్‌టైల్ పాదరక్షలు, రత్నాలు, ఆభరణాల ఎగుమతిదారులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

ఇక యూనస్ వ్యాఖ్యలకు జై శంకర్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. బంగాళాఖాతంలో భారత్‌కు పొడవైన తీరరేఖ ఉందని గుర్తు చేశారు. తర్వాత ప్రధాని మోదీ- యూనస్ భేటీ కూడా జరిగింది. అక్రమ వలసలు, మైనార్టీలపై దాడులు, హసీనా అప్పగింత అంశాలు వారిద్దరి మధ్య చర్చకు వచ్చాయి.

## అమెరికా సుంకాలపై చర్చ అనివార్యం

భారత్‌పై అమెరికా విధించిన 26 శాతం సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ టారిఫ్‌లతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతు న్నాయి. ట్రేడ్‌వార్ భయాల వేళ.. కేంద్ర ప్రభుత్వం కీలక క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించనుంది. వాటి ప్రభావాన్ని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించనున్నారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లో ఇప్పటికే 10 శాతం అమల్లోకి రాగా.. తాజాగా మరో 16 శాతం నేటి నుంచి అమలవుతోంది. తనకు మోదీ గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదని టారిఫ్‌ల విధింపు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు పేర్కొన్న సంగతి తెలిసిందే. 52 శాతం సుంకాలను విధిస్తోందన్నారు. తాము అందులో సగమే విధిస్తున్నామని చెప్పారు. "డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌ల నుంచి ఉపశమనం కలిగించే మార్గాలపై మోదీ ప్రభుత్వం దృష్టిసారించింది. అయితే, ఇవి పరస్పర ప్రతీకారంగా ఉండకూడదని భావిస్తోంది. అలాంటి ఒప్పందాల దిశగా సిద్ధమవుతోంది" అని ప్రభుత్వ అధికారి ఒకరు ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే. సెమీ కండక్టర్లు, రాగి, ఔషధాలను అమెరికా సుంకాల నుంచి మినహా యించగా.. ఆటో విడిభాగాలు, రత్నాలు, ఆభరణాలు వంటి కీలక రంగాల్లో ఎగుమతులపై ప్రభావం పడనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో సమావేశంలో తీసుకునే నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఫైటర్ జెట్లతో నౌకాదళానికి జవసత్వాలు



భారత నౌకాదళానికి అత్యాధునిక ఫైటర్ జెట్లను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫ్రాన్స్ నుంచి 26 రఫేల్ మెరైన్ ఫైటర్ విమానాల కొనుగోలు డీల్‌ను భారత్ అంగీకరించింది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వార్త సంస్థ పేర్కొంది. ఈ డీల్ మొత్తం విలువ రూ.63,000 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీనిపై అతి త్వరలోనే సంతకాలు చేసే అవకాశాలున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం 22 సింగిల్ సీటర్ విమానాలు, శిక్షణ కోసం నాలుగు ట్విటన్ సీటర్ విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు కూడా దీనిలో ఉంటాయి. ఆఫ్సెట్ నిబంధన కింద దేశీయంగా కొన్ని విడిభాగాలు తయారుచేయాలనే షరతు కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ డీలు ఆమోదముద్ర వేసింది.

దేశీయంగా అభివృద్ధి చేసిన విమాన వాహక నౌకపై ఈ రఫేల్ మెరైన్లను మోహరించాలని భారత్ భావిస్తోంది. ఇది సముద్ర జలాల్లో మన దేశ నౌకాదళ శక్తిని గణనీయంగా పెంచనుంది. రఫేల్లో మెరైన్ శ్రేణి విమానాలను నౌకాదళాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేశారు. దీని ల్యాండింగ్ గేర్ భిన్నంగా ఉండటంతోపాటు.. అరెస్టర్ హుక్స్, చిన్న రన్వేపై టేకాఫ్ అయ్యేలా ప్రత్యేకమైన ఎయిర్ ఫ్రేమ్ వంటి వాటిల్లో వాడారు. ఇప్పటికే ఇది పలు పోరాటాల్లో తన శక్తిని చాటుకొంది. దీనిలో అత్యాధునిక ఏవియానిక్స్, ఆయుధాలు వంటి ఫీచర్లు ఉన్నాయి.

ఈ విమానం ఒప్పందం కుదిరిన నాటినుంచి నాలుగేళ్లకు మన నౌకాదళానికి అందటం మొదలవుతాయి. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని, 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ విమానాలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌పై వినియోగించనున్నారు. ఇప్పటికే ఉన్న మిగ్ 29కే విమానాల స్థానాలను ఇవి భర్తీ చేయనున్నాయి. భారత్-ఫ్రాన్స్ ప్రభుత్వాలు ఈ డీల్‌పై సంతకాలు చేయనున్నాయి. డసాల్ట్ నుంచి డెలివరీ డెడ్‌లైన్లు నిర్వహణ ఇతర అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రెంచి ప్రభుత్వమే చూస్తుంది.

## పాక్‌పై మరోసారి ధ్వజమెత్తిన జై శంకర్



పాకిస్థాన్‌పై భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జై శంకర్ విరుచుకుపడ్డారు. భారత్లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నామని ఆ దేశంలోని పలువురు ప్రజలు బహిరంగంగా, గర్వంగా చెప్పడం వినాశకరమన్నారు. న్యూస్ 18 రైజింగ్ - భారత్ సమ్మిట్లో భాగంగా మంత్రి మాట్లాడారు. "ఇదంతా నేను చెప్పాల్సిన పనిలేదు. కళ్లకు కనిపిస్తోంది. వారే చెప్పున్నారు కూడా. భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నామని బహిరంగంగా ప్రకటించే వ్యక్తులు పాకిస్థాన్లో ఉన్నారు. ఇవి ఊహాగానాలు కాదు.. వారు గర్వంగా చెప్తోన్న విషయమిది. మీరొక టెర్రరిజం ఇండస్ట్రీని ప్రారంభిస్తే.. అదే మిమ్మల్ని దెబ్బతీస్తుందని ఎంతోమంది చెప్పారు. ఇప్పుడు మనం చూస్తున్నది అదే. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం వల్ల నేడు పాక్ మూల్యం చెల్లించుకుంటోంది. నేను మీతో ఉదయం మంచిగా ఉండి.. రాత్రికి మీ ఇంటిపై వచ్చి దాడి చేస్తే మీకు ఓకేనా..? అలాంటివారితో కలిసి ఉంటారా..?" అని విదేశాంగమంత్రి జై శంకర్ పశ్నించారు.

***కొత్తగా చెప్పడానికేమీ లేదు***

26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి అయిన తహవూర్ రాణా అప్పగింతపై మంత్రి స్పందించారు. "ఈ అంశంలో కొత్తగా చెప్పడానికి ఏమీలేదు. అమెరికా కోర్టుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని తెలిపారు. బలోచిస్థాన్లోని అస్థిరతపై మాట్లాడేందుకు నిరాకరించారు. రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. అతడిని తిరిగి అప్పగించేందుకు భారత్ కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేసింది. అప్పగింతను సవాల్ చేసిన రాణా.. న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకున్నా ప్రయోజనం లేకపోయింది. అతడిని తీసుకుని భారతీయ అధికారుల బృందం ప్రత్యేక విమానంలో ఇండియాకు తిరుగు పయనమైనట్లు తెలుస్తోంది. ఈ రాత్రికి లేదా రేపు తెల్లవారుజామున ఆ విమానం భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే.. పాక్‌ను ఉద్దేశించి జైశంకర్ గతంలోనూ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. "మన పొరుగున ఉన్న పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించింది. ఇప్పుడు అదే వారి పాలిట శాపమైంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అణచివేయాలని భారత్ సహా పలు దేశాలు కోరుతున్నాయి" అని అన్నారు.

***భారత్-చైనా సంబంధాలపై..***

ఈ సందర్భంగా డ్రాగన్‌తో సంబంధాలపై జైశంకర్ మాట్లాడుతూ.. అవి సానుకూల దిశలో పయనిస్తున్నాయని అన్నారు. రెండు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేయాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తంచేశారు. 2020లో తూర్పు లద్దాఖ్లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల జవాన్ల మధ్య జరిగిన ఘర్షణతో సంబంధాలు దిగజారాయి. తర్వాత సైనిక, దౌత్యపరమైన చర్చల ఫలితంగా కీలక గస్తీ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. దాని ప్రకారం.. 2020 నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి ఇక కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు ఇక స్వేచ్ఛగా వెళ్లొచ్చు.

## బిహార్‌లో వర్షం.. బీభత్సం

బిహార్‌లో పలు జిల్లాల్లో ఈదురు గాలులు, వడగళ్ల వాన బీభత్సం సృష్టించాయి. బుధవారం ఉదయం రాష్ట్రంలోని నాలుగు జిల్లాల పరిధిలో పిడుగులు పడి 13 మంది ప్రాణాలు కోల్పోయారు. బెగూసరాయ్, దర్భంగా జిల్లాల్లో వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మంది మృతి చెందారు. మధుబనీలో ముగ్గురు చనిపోగా ఇందులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కుమార్తె ఉన్నారు. సమస్తిపుర్లో ఓ వ్యక్తి పిడుగుపాటు వల్ల చనిపోయినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, బాధిత కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసే సూచనల ప్రకారం నడచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదిలాఉంటే, బిహార్ ఆర్థిక సర్వే (2024-25) ప్రకారం 2023లో పిడుగుపాటు కారణంగా రాష్ట్రంలో 275 మంది ప్రాణాలు కోల్పోయారు.

# యుద్ధంలో రష్యా తరపున చైనీయులు

## ఓ వీడియోలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఆరోపణ



ఉక్రెయిన్– రష్యాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే ఓ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. కీవ్‌తో మాస్కో చేస్తున్న పోరాటంలో చైనా పౌరులు కూడా పాల్గొన్నట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈమేరకు ఆరోపణలు చేశారు. తమ బలగాలు ఇద్దరు చైనీయులను అదుపులోకి తీసుకున్నాయని ఓ వీడియోలో ఆయన పేర్కొన్నారు.

రష్యా సైన్యంతో కలిసి పోరాడుతున్న ఇద్దరు చైనీయులను డోనెట్స్క్ ప్రాంతంలో తమ దళాలు బంధించాయని జెలెన్ స్కీ తెలిపారు. వారి వీడియోలను తమ వాళ్లు చిత్రీకరించారని వెల్లడించారు. వారి వ్యక్తిగత డేటా, బ్యాంకు కార్డులతో సహా ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. తమ దళాలు మొత్తం ఆరుగురు చైనీయులతో పోరాడగా.. ఇద్దరిని బంధించారన్నారు. రష్యా సైన్యంలో చైనీయుల సంఖ్య మరింతమంది ఉన్నారనే సమాచారం తమకు ఉందన్నారు. దీంతో యుద్ధాన్ని ముగించాలనే ఉద్దేశం అధ్యక్షుడు పుతిన్‌కు లేదని స్పష్టమవుతోందన్నారు. ప్రపంచశాంతిని కోరుకునే దేశాలు దీనిపై స్పందించాలన్నారు. ఈ పౌరులను చైనా ప్రభుత్వం పంపించి ఉండదని, వారే రష్యా దళాలతో ఒప్పందం కుదుర్చుకుని ఉండవచ్చని ఉక్రెయిన్‌కు చెందిన సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. ఈ ఆరోపణలపై డ్రాగన్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే, దీనిపై చైనా తప్పక వివరణ ఇవ్వాలని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సైబిగా పేర్కొన్నారు. తాజా ఘటనపై అమెరికా స్పందించింది. ఇది తమను కలవరపాటుకి గురిచేసిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ పేర్కొన్నారు. కీవ్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు చైనా మద్దతు ఉందనేది దీనిద్వారా తెలుస్తోందన్నారు. ఇదిలాఉండగా.. ఉక్రెయిన్‌తో యుద్ధంలో భాగంగా రష్యాకు ఉత్తరకొరియా పూర్తి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా భారీసంఖ్యలో సంప్రదాయ ఆయుధాలను, 10–12వేల మంది వరకు బలగాలను పంపిందని పాశ్చాత్య మీడియా గతంలో వెల్లడించింది.

మరోవైపు.. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులోభాగంగా ఇరుదేశాల అధినేతలతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజులపాటు దాడులు నిలిపివేసేలా చూడాలని అమెరికా, రష్యా ఒప్పందం చేసుకున్నాయి. దీనికి పుతిన్ అంగీకరించారని, శాంతి దిశగా ఇది తొలిఅడుగు అని అమెరికా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. నల్ల సముద్రంలో దాడుల విరమణకు, ఆ తర్వాత పూర్తిగా యుద్ధం అంతానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది.

# ట్రంప్ చర్యకు డ్రాగన్ ప్రతిచర్య

## అమెరికా ఉత్పత్తులపై 84శాతం సుంకాల విధింపు



ట్రేడ్ వార్లో అమెరికా– చైనా ఢీ అంటే ఢీ అంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదలు పెట్టిన సుంకాల యుద్ధాన్ని చైనా కూడా అదేస్థాయిలో తిప్పికొడుతోంది. డ్రాగన్ దేశం నుంచి వచ్చే వస్తువులపై ట్రంప్ 104 శాతం సుంకం విధించిన నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై తాము 84 శాతం సుంకం విధిస్తున్నట్లు బీజింగ్ తాజాగా ప్రకటించింది. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఈ సుంకాలు అమల్లోకి వస్తాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల చైనాపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని చైనా కూడా నిర్ణయించింది. దీంతో భగ్గుమన్న ట్రంప్.. ఏప్రిల్ 8లోగా చైనా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. లేకుంటే అదనంగా మరో 50 శాతం ప్రతీకార సుంకం విధిస్తానన్నారు. ఇచ్చిన గడువులోగా చైనా స్పందించకపోవడంతో తాను చెప్పినట్లుగానే చేశారు. గతంలో విధించిన 54 శాతానికి అదనంగా 50 శాతం జోడించడంతో చైనాపై విధించిన సుంకాలు 104 శాతానికి చేరుకున్నాయి. అమెరికా అహంకారంతో వ్యవహరిస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని చైనా ఆరోపించింది. ప్రతిగా మరో 50 శాతం సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించింది.

పోరుకు జట్టుకడదాం: భారత్‌కు చైనా అరుదైన రిక్వెస్ట్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలతో ప్రపంచమంతా వాణిజ్య యుద్ధ భయాలు కమ్ముకున్నాయి. ముఖ్యంగా చైనాపై 104 శాతం టారిఫ్‌లు ప్రకటించడం ఈ ఆర్థిక అనిశ్చితులవేళ మరింత ఆందోళనకరంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో చైనా అధికారిణి ఒకరు కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుంకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్, చైనా జత కట్టాలని న్యూఢిల్లీలోని బీజింగ్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ అన్నారు. ఈమేరకు ఆమె చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో భారత్–చైనా ఆర్థిక సంబంధాల గురించి ఆమె ప్రస్తావించారు. "పరస్పర సహకారం, ప్రయోజనాలపై ఇరు దేశాల ఆర్థిక, వాణిజ్య సంబంధాలు ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా సుంకాల వేధింపుల కారణంగా అనేక దేశాలు, ముఖ్యంగా పేద దేశాలు.. అభివృద్ధి చెందే హక్కును కోల్పోతున్నాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు మన రెండు దేశాలు కలిసి నిలబడాలి. వాణిజ్య, సుంకాల యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరు. విస్తృతమైన సంప్రదింపుల తర్వాత రూపొందించిన అంతర్జాతీయ విధానాలను అన్ని దేశాలు గౌరవించాలి. ఇలా ఏకపక్షవాదం, రక్షణవాదంతో తీసుకునే నిర్ణయాలను సమష్టిగా వ్యతిరేకించాలి" అని చైనా అధికారిణి పిలుపునిచ్చారు.

# విక్టరీ డే పరేడ్‌కు మీరు రావాలి

## ప్రధాని మోదీకి రష్యా ఆహ్వానం



మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని భారత ప్రధాని నరేంద్ర మోదీకి రష్యా ఆహ్వానం పంపింది. ఈమేరకు ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆండ్రీ రుడెంకో వెల్లడించారు. రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా 'విక్టరీ డే' (మే 9న)ని రష్యా నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఈ వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్టు ఆండ్రీ రుడెంకో తెలిపారు. ఇప్పటికే ఆహ్వానం పంపినట్లు.. పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఓ రష్యన్ వార్తా సంస్థ కూడా వెల్లడించింది. ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తమ మిత్ర దేశాలకు ఆహ్వానాలు పంపింది. ఇక ప్రధాని మోదీ రష్యాలో గత ఏడాది జులైలో పర్యటించారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశ పర్యటన చేపట్టారు. 2019లో వ్లాడివోస్టాక్‌లో జరిగిన ఆర్థిక సదస్సుకు ఆయన హాజరయ్యారు. గత పర్యటన సందర్భంగా భారత్‌లో పర్యటించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను మోదీ ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ అంగీకరించినప్పటికీ.. పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదు. ఇక పుతిన్, మోదీలు తరచూ ఫోన్లో వివిధ అంశాలపై సంభాషించుకుంటారన్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతారు.



# తోకలేని యుద్ధవిమానం

## చైనా ఆరోతరం ఆయుధంగా వీడియోలు వైరల్

చైనా రూపొందించిన ఓ యుద్ధవిమానం వీడియో ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ విమానానికి మూడు ఇంజిన్లు ఉండటంతోపాటు.. తోకలేకపోవడం విశేషం. పశ్చిమ దేశాలకు చెందిన నిపుణులు దానిని ఆరోతరానికి చెందిన జె–36గా అభివర్ణిస్తున్నారు. ఈ విమానం సిచువాన్ ప్రావిన్స్‌లోని చెంగ్డూ ఎయిర్ క్రాఫ్ట్ ఇండస్ట్రీ రన్వేకు వెళ్లే క్రమంలో ఓ జాతీయ రహదారిపై అతి తక్కువ ఎత్తులో ప్రయాణించింది. దీనిని కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వీడియో తీశాడు. గతేడాది చివర్లో తొలిసారి జె–36 ఫొటోలు ఇంటర్నెట్‌లో దర్శనమిచ్చాయి. ఆ తర్వాత ఈ ఏడాది మార్చిలో మరోసారి బయటకు వచ్చాయి. ఈ విమానంలో చైనా ఇంజినీర్లు అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీని, ఏవియానిక్స్ పవర్‌ప్లాంట్ ఎయిర్ ఫ్రేము అమర్చినట్లు నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. రెండు ఎయిర్ ఇన్టేక్స్ ట్రైజెట్ ఇంజిన్‌ను అమర్చారని చెబుతున్నారు. దీనిలో ఆయుధాలను అంతర్గతంగా భద్రపర్చుకొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. వీటిల్లో దీర్ఘశ్రేణి క్షిపణులను కూడా అమర్చే అవకాశాలున్నట్లు అమెరికా సైనిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం అమెరికా వద్ద ఐదో తరానికి చెందిన రెండు ఇంజిన్లతో పనిచేసే ఎఫ్–22, ఒక ఇంజిన్ అమర్చిన ఎఫ్–35 ఉన్నాయి. వీటిని పలు దాడుల్లో వినియోగించింది. చైనా వద్ద కూడా జె–20, జె–35 ఉన్నాయి. కానీ, ఇవి ఇంతవరకు యుద్ధ రంగంలోకి అడుగు పెట్టలేదు. ఇక అమెరికా అత్యాధునిక యుద్ధవిమానం ఎఫ్–47 తయారీ కాంట్రాక్టును బోయింగ్ సంస్థకు అప్పగించింది.

# డబ్ల్యుటీవో నిబంధనలకు విరుద్ధం

## - ట్రంప్ సుంకాలపై రష్యా వ్యాఖ్య



అమెరికా పేల్చిన టారిఫ్ బాంబ్‌పై రష్యా కీలక వ్యాఖ్యలు చేసింది. "వైట్ హౌస్ విధించిన సుంకాలు.. ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రాథమిక నిబంధనలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. వాటిని ఉల్లంఘించేవిగా ఉన్నాయి. వాషింగ్టన్ ఇకపై అంతర్జాతీయ వాణిజ్య చట్ట నియమాలకు కట్టుబడి ఉండదని అవి నిరూపిస్తున్నాయి" అని రష్యా విదేశాంగశాఖ ప్రతినిధి మారియా జఖరోవా అన్నారు. ట్రంప్ వివిధ దేశాలపై విధించిన పరస్పర సుంకాలతో అనేక వ్యాపార రంగాలు కుదేలవుతున్నాయి. అటు ముడి చమురు ధరలు నానాటికీ పడిపోతున్నాయి. ఇది రష్యాకు ఆందోళనకరంగా మారింది. చమురు, ఖనిజ ఉత్పత్తుల నుంచి వచ్చే ఆదాయంపై ఎక్కువగా ఆధారపడిన మాస్కో.. ఇప్పుడు సంక్షోభ భయాలను ఎదుర్కొంటోంది. రష్యా ఫెడరల్ బడ్జెట్‌కు అత్యధిక ఆదాయం చమురు, గ్యాస్ రంగంనుంచే వస్తుంది. అయితే, గత కొన్ని రోజులుగా చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ ఆదాయానికి గండిపడింది. ఏప్రిల్లో ఈ నష్టం మరింత ఎక్కువగా ఉండొచ్చని అంచనాలు వెలువడుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో అమెరికా, రష్యా వైఖరి ఒకేలా ఉంది. పుతిన్ ప్రభుత్వానికే ట్రంప్ మద్దతు లభిస్తోంది. ఈ తరుణంలో సుంకాలను వ్యతిరేకిస్తూ మాస్కోనుంచి స్పందన రావడం గమనార్హం.

# రాజస్థాన్ రాయల్స్‌కు ఘోర పరాజయం!

## - గుజరాత్ టైటాన్స్ 58 పరుగుల తేడాతో విజయం



ఐపీఎల్ 2025 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జోరు కొనసాగుతోంది. వరుసగా నాలుగో విజయాన్ని ఆ జట్టు ఖాతాలో వేసుకుంది. రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 58 పరుగుల తేడాతో గెలుపొందింది. ప్రసిధ్ కృష్ణ(3/24) తీన్మార్ బౌలింగ్‌తో రాజస్థాన్ రాయల్స్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 217 పరుగులు చేసింది.

సాయి సుదర్శన్(53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 82) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. జోస్ బట్లర్(25 బంతుల్లో 5 ఫోర్లతో 36), షారూఖ్ ఖాన్(20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36), రాహుల్ తెవాటియా(12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 24 నాటౌట్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే(2/53), మహీష్ తీక్షణ(2/54)రెండేసి వికెట్లు తీయగా.. జోఫ్రా ఆర్చర్(1/30), సందీప్ శర్మ(1/41) చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం రాజస్థాన్ రాయల్స్ 19.2 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. సంజూ శాంసన్(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41), షిమ్రాన్ హెట్‌మైర్(32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 52) మినహా అంతా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/24) మూడు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, అర్షద్ ఖాన్, కుల్వంత్ ఖేజ్రోలియా తలో వికెట్ తీసారు. రషీద్ ఖాన్(2/37), సాయి కిషోర్(2/20)లకు రెండేసి వికెట్లు దక్కాయి. సంజూ శాంసన్ వికెట్ ఈ మ్యాచ్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడం కూడా రాజస్థాన్ రాయల్స్‌కు నష్టం చేసింది.

### నిరాశపర్చిన యశస్వి, రాణా..

భారీ లక్ష్యచేధనలో రాజస్థాన్ రాయల్స్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. వరుస ఓవర్లలో యశస్వి జైస్వాల్(6), నితీష్ రాణా(1) పెవిలియన్ చేరారు. యశస్విని అర్షద్.. రాణాను సిరాజ్ పెవిలియన్ చేర్చాడు. రియాన్ పరాగ్‌తో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించిన సంజూ శాంసన్.. తనదైన షాట్లతో చెలరేగాడు. దాంతో పవర్ ప్లేలో రాజస్తాన్ రాయల్స్ 2 వికెట్లకు 57 పరుగులు చేసింది. మూడు సిక్స్‌లతో దూకుడుగా ఆడిన రియాన్ పరాగ్(26)ను కుల్వంత్ కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే ధ్రువ్ జురెల్(5)ను రషీద్ ఖాన్ ఔట్ చేయడంతో 68 పరుగులకే రాజస్థాన్ 5 వికెట్లు కోల్పోయింది.

### మ్యాచ్ టర్నింగ్ పాయింట్..

ఈ పరిస్థితుల్లో షిమ్రాన్ హెట్‌మైర్‌తో కలిసి సంజూ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. 48 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సంజూను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన శుభమ్ దూబే(1), జోఫ్రా ఆర్చర్(4) తీవ్రంగా నిరాశపరిచారు. ఓవైపు వికెట్లు పడినా మరోవైపు హెట్‌మైర్ చెలరేగాడు. 29 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

### ప్రసిధ్ అన్‌సంగ్ హీరో..

అయితే అతన్ని కూడా ప్రసిధ్ కృష్ణ పెవిలియన్ చేర్చడంతో రాజస్థాన్ ఓటమి ఖాయమైంది. మహీష్ తీక్షణ(5), తుషార్ దేశ్‌పాండే(3) తీవ్రంగా నిరాశపరిచారు. సందీప్ శర్మ(6 నాటౌట్) అజేయంగా నిలిచాడు. సంజూ శాంసన్‌తో పాటు హెట్‌మైర్, జోఫ్రా ఆర్చర్‌లను ఔట్ చేసి ప్రసిధ్ కృష్ణ రాజస్థాన్ రాయల్స్ పతనాన్ని శాసించాడు. అద్భుత ప్రదర్శనతో గుజరాత్ టైటాన్స్ అన్‌సంగ్ హీరోగా నిలిచాడు.

### సాయి సంచలన బ్యాటింగ్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్‌కు ఆదిలోనే బిగ్ షాక్ తగిలింది. జోఫ్రా ఆర్చర్ స్టన్నింగ్ డెలివరీకి శుభ్‌మన్ గిల్(2) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. జోస్ బట్లర్‌తో కలిసి సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆచితూచి ఆడిన ఈ జోడీ వీలు చిక్కిన బంతిని బౌండరీకి తరలించింది. దాంతో పవర్ ప్లేలో గుజరాత్ టైటాన్స్ వికెట్ నష్టానికి 56 పరుగులు చేసింది. అనంతరం మరింత దూకుడుగా ఆడిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. తీక్షణ బౌలింగ్‌లో సింగిల్ తీసి సాయి సుదర్శన్ 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

### తేవాటియా మెరుపులు..

అదే ఓవర్ ఆఖరి బంతికి జోస్ బట్లర్ ఎల్బీగా వెనుదిరిగాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 80 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన షారూఖ్ ఖాన్ దూకుడుగా ఆడాడు. భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అతన్ని తీక్షణ ఔట్ చేయగా.. షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్(7)ను సందీప్ శర్మ పెవిలియన్ చేర్చాడు. సెంచరీ దిశగా సాగిన సాయి సుదర్శన్‌ను తుషార్ దేశ్‌పాండే కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. రషీద్ ఖాన్(12) సాయంతో రాహుల్ తేవాటియా.. జట్టు స్కోర్‌ను 200 ధాటించాడు.

### టేబుల్ టాపర్‌గా గుజరాత్

ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. 5 మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచి 8 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్ ఏడో స్థానాన్ని పడిపోయింది. ఐదు మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్ 2 విజయాలు మాత్రమే నమోదు చేసింది. టాప్-4లో గుజరాత్ టైటాన్స్‌తో పాటు ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ కొనసాగుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ 10వ స్థానంలో నిలిచింది.

| Pos | Teams | M | W | L | T | N/R | PT | NRR | Series Form |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | GT | 5 | 4 | 1 | 0 | 0 | 8 | +1.413 | W W W W L |
| 2 | DC | 3 | 3 | 0 | 0 | 0 | 6 | +1.257 | W W W |
| 3 | RCB | 4 | 3 | 1 | 0 | 0 | 6 | +1.015 | W L W W |
| 4 | PBKS | 4 | 3 | 1 | 0 | 0 | 6 | +0.289 | W L W W |
| 5 | LSG | 5 | 3 | 2 | 0 | 0 | 6 | +0.078 | W W L W L |
| 6 | KKR | 5 | 2 | 3 | 0 | 0 | 4 | -0.056 | L W L W L |
| 7 | RR | 5 | 2 | 3 | 0 | 0 | 4 | -0.733 | L W W L L |
| 8 | MI | 5 | 1 | 4 | 0 | 0 | 2 | -0.010 | L L W L L |
| 9 | CSK | 5 | 1 | 4 | 0 | 0 | 2 | -0.889 | L L L L W |
| 10 | SRH | 5 | 1 | 4 | 0 | 0 | 2 | -1.629 | L L L L W |




### నెం.1గా ఆర్సీబీ..

# అత్యధిక వ్యూస్ ఆ మ్యాచ్‌కే!!

*ఐపీఎల్ లో బడా జట్లు అనగానే టక్కున గుర్తొచ్చే పేర్లు చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్. ఈ నాలుగు జట్లలో టైటిల్స్ పరంగా చూస్తే.. సీఎస్కే (5), ముంబయి (5), కేకేఆర్ (3) ముందు వరుసలో ఉన్నాయి. ఒక్క టైటిల్ కూడా సాధించకపోయినా క్రేజ్ పరంగా ఈ మూడు జట్లతో సమానంగా ఉంది ఆర్సీబీ. అదీ బెంగళూరు జట్టు ఘనత. వాస్తవంగా చెప్పాలంటే సోషల్ మీడియాలో ఆర్సీబీకే ఎక్కువ క్రేజ్ కనిపిస్తుంటుంది. ఇటీవలే ఇన్ స్టాలోనూ అత్యధిక ఫాలోవర్స్ ఉన్న జట్టుగానూ అవతరించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 17.8 మిలియన్ మంది ఫాలోవర్స్ ను సంపాదించుకుంది.*

### *ఆర్సీబీ మ్యాచులకే అత్యధిక వ్యూస్..*

*అయితే తాజాగా ఆర్సీబీ మరో ఘనత కూడా సాధించింది. ఐపీఎల్ 2025లో జియో హాట్ స్టార్‌లో ఆర్సీబీ ఆడిన మ్యాచులకే అత్యధిక వ్యూస్ వచ్చాయి. ఓపెనింగ్ మ్యాచ్ ఆర్సీబీ వర్సెస్ కేకేఆర్ మ్యాచ్ 41.7 కోట్లతో అత్యధిక వ్యూస్ అందుకున్న మ్యాచుగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో ఆర్సీబీ వర్సెస్ సీఎస్కే 37.4 కోట్లు, ఆర్సీబీ వర్సెస్ ఎంఐ 34.7 కోట్లు వ్యూస్ దక్కించుకున్నాయి. అంటే ఈ మూడు మ్యాచుల్లోనూ ఆర్సీబీనే ఉండటం విశేషం.*

### *ఏఏ స్థానాల్లో ఉన్నాయంటే?*

*ప్రస్తుతం ఈ సీజన్ లో ఈ నాలుగు జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరే (ఆర్సీబీ) మంచి ప్రదర్శన చేస్తూ ముందుకెళ్తోంది. ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచుల్లో మూడింటిలో గెలిచి పాయింట్ల పట్టికలో 6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఆడిన ఐదింటిలో నాలుగింటిలో ఓడిపోయి 2 పాయింట్లతో 9వ స్థానంలో, ముంబయి ఇండియన్స్ (ఎంఐ) ఆడిన ఐదింటిలో నాలుగింటిలో ఓడిపోయి 2 పాయింట్లతో 8వ స్థానంలో, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఆడిన ఐదింటిలో మూడింటిలో ఓడిపోయి 4 పాయింట్లతో 6వ స్థానంలో నిలిచాయి.*

చైతన్య రథం సినిమా
గురువారం 10 ఏప్రిల్ 2025


# లైఫ్‌నే మార్చేశాడు!

అజిత్ హీరోగా గుడ్ బ్యాడ్ అగ్లీ ప్రాజెక్టు తెరకెక్కించాడు దర్శకుడు అధిక్ రవిచంద్రన్. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకొస్తున్న సినిమాకు సంబంధించి ప్రమోషన్స్‌లో బిజీగావున్న అధిక్.. ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. అజిత్‌ను కలిసిన తర్వాత తన జీవితమే మారిపోయిందని అన్నాడు. “22 ఏళ్ల దర్శకుడిగా తొలి సినిమాను తెరకెక్కించాను. తర్వాత ఓ సినిమా (అన్బానవన్ అసరాధవన్) ఫ్లాప్ అయింది. ఆ సమయంలో అజిత్ తప్ప నాకెవ్వరూ ధైర్యం చెప్పలేదు. ఆయన ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మర్చిపోలేను. అప్పటినుంచి నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. ప్రేక్షకులు ఎలాంటి సినిమాలను ఆదరిస్తారో అర్థమైంది. ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’ తెరకెక్కించే సమయంలో ఆయన గురించి మరింత తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆయన చుట్టూ ఉండే వ్యక్తులతో ఎలా వ్యవహరిస్తారో తెలుసుకున్నాను. ఆయన ఒక లెజెండ్. ఎవరినీ బాధపెట్టరు. ఎవరి గురించి చెడుగా మాట్లాడరు. ఆయన కోసం ఎన్నో కాస్ట్యూమ్స్ తయారుచేశాం. వాటిని ఎంతో ఓపికగా ధరించారు” అని చెప్పారు. గుడ్ బ్యాడ్ అగ్లీ’పై ఆడియన్స్‌లో ఆసక్తి కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు సినిమాపై అంచనాలు పెంచేశాయి. అజిత్, త్రిషల మధ్య సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. తాజాగా సినిమాలోని ‘గాడ్ బ్లెస్ యూ’ అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం విడుదల చేసింది.





## బ్లో అప్

హెబ్బా పటేల్



## ఆసక్తి రేకెత్తిస్తున్న జాట్



బాలీవుడ్ యాక్షన్ హీరో సన్నీ డియోల్ నటించిన లేటెస్ట్ చిత్రం ‘జాట్’ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన మూవీపై సౌత్‌లోనూ మంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ఆ విషయాన్ని చెప్పకనే చెబుతుంది.

సినిమాను పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా చిత్ర యూనిట్ తెరకెక్కించడంతో.. మాస్‌వర్గాలకు ఫుల్ ట్రీట్ ఇవ్వడం ఖాయమన్న మాట వినిపిస్తోంది. తాజాగా చిత్రానికి సెన్సార్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. రణ్‌దీప్ హుడా, రెజీనా కాసాండ్రా, వినీత్ కుమార్ సింగ్, సయ్యామీ ఖేర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.

## తోడేళ్ల చెరనుంచి కాపాడుకుందాం

హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బాలీవుడ్ నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంటికి రూ.లక్ష కరెంట్ బిల్లు వచ్చిందన్న ఆమె.. అసలు ఆ ఇంట్లో తాము నివాసమే ఉండటం లేదన్నారు. అలాంటప్పుడు అంత బిల్లు ఎలా వస్తుందంటూ మండిపడ్డారు. ‘మనాలీలో ఉన్న మా ఇంటికి ఈనెల రూ.లక్ష కరెంట్ బిల్లు వచ్చింది. ఈ మధ్యకాలంలో నేను ఆ ఇంట్లో ఉండటంలేదు. దీంతో ఆ బిల్లు చూసి షాకయ్యా.రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఇలాంటి పరిస్థితులు సిగ్గుచేటు. అయినప్పటికీ మనందరికీ ఒక అవకాశం ఉంది. నా సోదరీ సోదరు లను నేను కోరేది ఒక్కటే. ఇలాంటి సమస్యలపై మన మంతా క్షేత్రస్థాయిలో పనిచేయాలి. దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తోడేళ్ల చెరనుంచి మన రాష్ట్రాన్ని కాపాడుకుందాం” అని ఆమె వ్యాఖ్యానించారు.

## షాకిస్తున్న ఏఐ పెద్ది!



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం ‘పెద్ది’. జాన్వీకపూర్ కథానాయిక. తాజాగా ఈ సినిమా గ్లింప్సును విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో చరణ్ ఉత్తరాంధ్ర యాసలో డైలాగు చెప్పి అలరించారు. ఇప్పుడిదే డైలాగుకు సంబంధించిన ఏఐ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

‘ఒకే పని సెసేనాకి... ఒకే నాగ బతికేనాకి... ఇంత పెద్ద బతుకెందుకు? ఏదైనా ఈ నేల మీద ఉన్నప్పుడే సేసెయ్యాల... పుడతామా యేటి మళ్లీ!’ అనే డైలాగును రామ్‌చరణ్ చెప్పినట్టే ఏఐతో ఓ వీడియో క్రియేట్ చేశారు. ఈ వీడియోను చరణ్ అభిమానులు షేర్ చేస్తున్నారు. చాలా బాగా క్రియేట్ చేశారంటూ ప్రశంసిస్తున్నారు. మరికొందరు మాత్రం దీన్ని చూసి నిజంగానే చరణ్ చెప్పినట్టు ఉందంటూ ఆశ్చర్యపోతున్నారు. ‘పెద్ది’కి రెహమాన్ స్వరాలు అందిస్తున్నారు. క్రీడా నేపథ్యంలో సాగే కథ ఇది. పెద్ది పాత్రలో రామ్చరణ్ బ్యాట్ పట్టుకుని చేసిన సందడి, ఆయన కొట్టిన షాట్, ఉత్తరాంధ్ర యాసలో సంభాషణలు ఇటీవల విడుదల చేసిన గ్లింప్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ‘పెద్ది’ ఫస్ట్ షాట్‌కు సినీప్రియులనుంచి వస్తోన్న స్పందనపై చిత్ర నిర్మాణసంస్థ వృద్ధి సినిమాస్ స్పందించింది. తమ వీడియోపై అమితమైన ప్రేమ కనబరిచిన వారందరికీ ధన్యవాదాలు చెప్పింది. ఆ స్పందన చూసి తమకు ఎంతో ఆనందంగా అనిపించిందని.. తమపై మరింత బాధ్యత పెంచిందని పేర్కొంది.

## తమ్మూ.. చమత్కారం



సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా వస్తున్న ‘ఓదెల 2’ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది నటి తమన్నా. ట్రైలర్ విడుదల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. మీడియా క్వీర్కీ ప్రశ్నలకు అంతే చమత్కారంగా సమాధానాలిచ్చింది. బ్రేకప్ చెప్పుకున్న నటుడు విజయ్‌ని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. “మంత్రాలు, తంత్రాలు ఉపయోగించి మీరు ఎవరిమీదనైనా విజయం సాధించాలనుకుంటున్నారా?” అన్న ప్రశ్నకు తమన్నా స్పందిస్తూ.. “మంత్ర, తంత్రాలతో అలాంటిది జరుగుతుందంటే నమ్మను. ఒకవేళ అదే నిజమైతే మీడియాపైనే ప్రయోగిస్తా. అందరూ నా చేతుల్లో ఉంటారు. నేను చెప్పింది వింటారు. ఏం చెబితే అదే రాసుకుంటారు” అని సరదాగా బదులిచ్చారు. అనంతరం ఆధ్యాత్మిక జీవనం గురించి తమన్నా మాట్లాడారు. “జీవితంలో మనకు ఎలాంటి సమస్య ఎదురైనా దానినుంచి బయట పడేందుకు ఎదుటి వ్యక్తులపై ఆధారపడాలనుకుంటాం. ఆవిధంగా వారి నుంచి సపోర్ట్ పొందుతాం. కానీ, ఆధ్యాత్మిక ప్రయాణంలో నేను ఒక విషయాన్ని నేర్చుకున్నా. ఆనందం లేదా బాధ మన చేతుల్లోనే ఉండాలి. ప్రశ్న ఏదైనా లోతుగా ఆలోచిస్తే సమాధానం కూడా దొరుకుతుంది” అని బరువైన సమాధానమిచ్చారు. 2022లో విడుదలైన ‘ఓదెల రైల్వేస్టేషన్’కు కొనసాగింపుగా ‘ఓదెల 2’ సిద్ధమైంది. ఇందులో తమన్నా శివశక్తిగా కనిపించనున్నారు. అశోక్ తేజ దర్శకుడు. ఏప్రిల్ 17న ఈ సినిమా విడుదల కానుంది.

## మంచి క్యారెక్టర్ చేశా

టాలీవుడ్ హీరో సుధీర్‌బాబు నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘జటాధర’. సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్ ఆకట్టుకునేలా ఉండటంతో.. మూవీపై సినీ లవర్స్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. సినిమాను పాన్ ఇండియా చిత్రంగా భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు మేకర్స్. కాగా, బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా తొలి తెలుగు ప్రాజెక్టుగా ఇందులో నటిస్తోంది. సినిమా షూటింగ్‌లో తన క్యారెక్టర్ పార్ట్ పూర్తి చేసుకున్న సోనాక్షి..అదే విషయాన్ని ఫ్యాన్స్‌కి అప్‌డేట్‌ఇచ్చింది.సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూట్ పూర్తయ్యిందని..షూటింగ్‌ను ముగిస్తున్నట్లు తన ఇన్‌స్టా పేజీలో పోస్ట్ చేసింది. సినిమాలో తన పాత్ర అద్భుతంగా ఉందని..తన తొలి తెలుగు సినిమా షూటింగ్ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని కూడా పేర్కొంది. ఇక ఈ సినిమాతో సోనాక్షి టాలీవుడ్‌లో సాలిడ్ ఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంది. వెంకట్ కళ్యాణ్ డైరెక్ట్ చేస్తున్న సినిమాను శివిన్‌నారంగ్, ప్రేరణఅరోరా,నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.

